Yuvatharam Telugu Daily

RNI APTEL/2023/88231

# యువతరం

ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు

The Voice of youth

Postal Regd.No. KNL/3-77(D)/2025-2027

తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, అనంతపురం | సంపుటి : 03 | సంచిక : 293 | పేజీలు : 08, | వెల రూ. 4 రూ/ | గురువారం 21- 05 - 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad,



2లో

ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది: మంత్రి కొండపల్లి

విలేఖరులు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాలలో నూతనంగా ప్రారంభించిన యువతరం తెలుగు దినపత్రిక లో పనిచేయడానికి జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ ప్రతినిధులు, మండల స్థాయి విలేఖరులు కావలెను.

సంప్రదించవలసిన నెంబర్

9989924749
7013007309

# ఏడాది తర్వాత మళ్లీ కలవనున్న మోదీ, ట్రంప్..

- ఫ్రాన్స్‌లో జరగనున్న జీ7 సదస్సుకు ప్రత్యేక అతిథిగా ప్రధాని మోదీకి ఆహ్వానం
- ఏడాది తర్వాత మళ్లీ డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం
- గతేడాది భారత్-పాక్ కాల్పుల విరమణ క్రెడిట్‌పై ఇరు నేతల మధ్య పెరిగిన దూరం
- నోబెల్ శాంతి బహుమతి కోసమే ట్రంప్ వ్యాఖ్యలు చేశారని అప్పట్లో విమర్శలు
- ఈ భేటీతోనైనా వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయో లేదోనని ఆసక్తి




**ఢిల్లీ :**

ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి రేకెత్తించే అతికొద్ది సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల భేటీ ఒకటి. గతేడాది వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాల తర్వాత ఇప్పుడు మళ్లీ వారిద్దరూ ముఖాముఖి కలుసుకునే అవకాశం కనిపిస్తోంది. ఫ్రాన్స్‌లో వచ్చే నెలలో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సు - మిగతా 2 లో

## అద్భుతమైన విషయాన్ని కనిపెట్టిన చంద్రయాన్ ల్యాండర్.. సీక్రెట్‌గా ఉంచిన ఇస్రో!

- మిషన్ చివర్లో అరమీటర్ పైకి లేచిన ల్యాండర్
- రాకెట్ మంటల ధాటికి కొట్టుకుపోయిన చందమామ పైపొర
- చంద్రుడిపై నేల పొరలుగా ఉందని అంచనా
- మూన్ బేస్ నిర్మాణానికి ఈ డేటా కీలకం



**ఢిల్లీ :**

భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ ముగిసినా సరికొత్త అద్భుతాలను బయటపెడుతూనే ఉంది. 'శివశక్తి పాయింట్' వద్ద విక్రమ్ ల్యాండర్ చేసిన ఒక చిన్న ప్రయోగం ఇప్పుడు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది.

## 'వర్క్ ఫ్రమ్ హోమ్' అని చెప్పి- తెల్లవారుజామున 8వేలమందిని తీసేసిన 'మెటా'





- మెటా, లింక్డ్ ఇన్ సంస్థల్లో భారీగా ఉద్యోగ కోతలు
- సింగపూర్ హబ్‌లోని ఉద్యోగులకు తెల్లవారుజామున 4 గంటలకే మెయిల్స్ పంపిన మెటా
- అనంతరం మిగతా దేశాల్లోని వారికి మెయిల్స్
- 600 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించిన లింక్డ్ ఇన్

**ఢిల్లీ :**

: టెక్ దిగ్గజం 'మెటా' మరోసారి భారీ లేఆఫ్స్‌ను ప్రకటించింది. అయితే, ఈసారి ఉద్యోగులను తొలగించిన విధానం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మొత్తం వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 10శాతం అంటే సుమారు 8వేల మంది - మిగతా 2 లో

# మధ్యాహ్నం వేళ ప్రయాణాలు మానుకోండి

### : ఎండల దృష్ట్యా ప్రజలకు సీఎం సూచన

- తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటు లో ఉంచాలన్న సీఎం
- వడదెబ్బకు గురైన వారికి తక్షణ వైద్యం అందించేలా వైద్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశం



**హైదరాబాద్ :**

తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యం గా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణో గ్రతలు నమోదవుతున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సీఎం స్పందించారు. జిల్లాల్లో మారుతున్న పరిస్థితులను - మిగతా 2 లో

## విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ ఆర్ బీఎం మినహాయింపు ఇవ్వండి : నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్



2 లో

- రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రితో భట్టి చర్చ
- ఎస్ ఏఎస్ సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి
- యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరణ

**హైదరాబాద్ :**

: ఢిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. ఆపై ఎస్ ఏఎస్ సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## తమిళ రాజకీయాల్లో కీలక పరిణామాలు.. విజయ్ కేబినెట్‌లో చేరనున్న వీసీకే?



- విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో చేరే అంశంపై వీసీకే సానుకూలత
- ఏఐఏడీఎంకే రెబల్స్‌ను కేబినెట్‌లోకి తీసుకోబోమని టీవీకే స్పష్టమైన హామీ
- మంత్రి పదవులపై వీసీకేలో మొదలైన అంతర్గత చర్చలు
- అధికారంలో భాగస్వామ్యం తమ చిరకాల రాజకీయ ఆకాంక్ష అని తెలిపిన తిరుమావళవన్
- సీనియర్ నేతలతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటన

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వంలో చేరేందుకు విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) సుముఖత వ్యక్తం చేసింది. మంత్రివర్గంలో చేరాలంటూ టీవీకే నుంచి మరోసారి అందిన ఆహ్వానంపై తమ పార్టీలో చర్చిస్తామని వీసీకే అధ్యక్షుడు థోల్ తిరుమావళవన్ ఈ రోజు సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ పరిణామంతో త్వరలోనే విజయ్ కేబినెట్‌లో వీసీకేకు చోటు - మిగతా 2 లో

## ఇక బయోమెట్రిక్ అక్కర్లేదు.. రేషన్ పంపిణీపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన



2 లో

- ఏపీలో రేషన్ పంపిణీకి డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) విధానం అమలు
- విజయవాడ, విశాఖపట్నంలలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు సన్నబియ్యం బదులు స్టీమ్డ్ రైస్
- 2 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం కొనుగోలుకు కేంద్రం అంగీకారం
- మిలటరీ క్యాంటీన్లలో అరకు కాఫీ విక్రయానికి ఎన్‌సీసీఎఫ్ ఆమోదం

**అమరావతి :**

ఏపీలో రేషన్ పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఇప్పటివరకు ఉన్న విధానానికి భిన్నంగా, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

## టీడీపీ మహానాడులో ఏపీ, తెలంగాణతో పాటు.. అండమాన్ కు సంబంధించిన తీర్మానం: సోమిరెడ్డి

- మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ముగిసిన మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం
- మహానాడులో 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని నిర్ణయం
- కూటమి ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్న సోమిరెడ్డి



2 లో

## 'మ్యాజిక్ డ్రెయిన్స్ 'ని మరిన్ని గ్రామాల్లో నిర్మించాలి



- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతో సమీక్షలో పవన్
- పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, శ్మశాన వాటికలను సర్వే చేయండి
- ఉపాధి హామీ పనులను మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలి
- 'పల్లెపండుగ' రెండో దశలో 3,580 కిలోమీటర్ల రహదారులు నిర్మాణం

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

### బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ తన లక్ష్యం

- నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ పై అధికారులు దృష్టిసారించాలి
- ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంత బిడ్డల్లా భావించి పనిచేయాలి
- ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్
- డీఈవోలు, ఏపీసీలతో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమావేశం



**అమరావతి :**

"దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం. అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నాను. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనా పద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తాం" అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఏపీసీలతో(అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, క్వాలిటీ మెరుగుపర్చకపోతే నష్టపోయేది పిల్లలే అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్ తో పోటీపడాలన్నారు. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు - మిగతా 2 లో

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

**మొదటిపేజీ తరువాయి -** తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ తన లక్ష్యమని, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

బిడ్డల భవిష్యత్తు కేంద్రంగా నిర్ణయాలు

"ఈ సమావేశం కేవలం సమీక్ష కోసం కాదు. యాక్షన్ ప్లాన్ కోసం ఏర్పాటు చేశాం. నేను విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఏ పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారో రాష్ట్రస్థాయి విజిబిలిటీ, కనీస డేటా అందుబాటులో లేదు. పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేసినప్పుడే నేను కేవలం మూడునెలల్లో పూర్తిస్థాయి సమాచారంతో డ్యాష్ బోర్డు తయారుచేశాం. విద్యాశాఖలో కనీస డేటా బేస్ అందుబాటులో లేని పరిస్థితి నుంచి విద్యాశాఖలో నా ప్రయాణం ప్రారంభించాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మన సొంత బిడ్డల్లా భావించి నిర్ణయాలు తీసుకోవాలి. మనం తీసుకునే నిర్ణయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. బిడ్డల భవిష్యత్ కేంద్రంగా నిర్ణయాలు ఉండాలి. డ్యాష్ బోర్డు ప్రకారం యాక్షన్ ప్లాన్ దిశగా డీఈవోలు, ఏపీసీలు పనిచేయాలి. రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది పిల్లలు డ్రాపవుట్స్ గా ఉన్నారు. నెవర్ ఎన్ రోల్డ్ పై కూడా ఫోకస్ చేయాలి. నూరుశాతం ఎన్ రోల్ మెంట్ పై అధికారులంతా దృష్టిపెట్టాలి. యువగళం పాదయాత్ర సమయంలో నేను కర్నూలు జిల్లాలో పర్యటించేటప్పుడు వలస కార్మికుల కష్టాలను కళ్లారా చూశాను. ఎట్టిపరిస్థితుల్లో పిల్లలు పొలం పనులకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు. ఈ విషయంలో ప్రాపర్ ట్రాక్ మెకానిజం ఉండాలి" అన్నారు.

ఉద్యమంలా జీఎఫ్ఎల్ఎన్ చేపట్టాలి

"లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్ ను ఒక ఉద్యమంగా అమలుచేయాలి. వాస్తవాలు తెలుసుకున్నపుడే సరైన నిర్ణయాలు తీసుకోగలం. నిజం చేదుగా, అబద్ధంగా తీయగా ఉంటుంది. వాస్తవాన్ని అంగీకరిస్తేనే మన ప్రయాణం సరైన దిశగా సాగుతుంది. మేం సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే మీరు సరైన సమాచారం ఇవ్వాలి. ప్రస్తుతం 9వ తరగతికి క్లిక్కర్ టెక్నాలజీ అమలు చేస్తున్నాం. క్రోమ్ బుక్స్ అందించబోతున్నాం. నూరుశాతం జీఎఫ్ఎల్ఎన్ సాధనే లక్ష్యంగా పనిచేయాలి. 5 శాతం వెనుకబడటం అంటే సాధారణమైంది కాదు. వాస్తవంలో అది లక్షల సంఖ్యలో ఉంటుంది. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 10శాతం ఎన్ రోల్ మెంట్ ఇంప్రూవ్ చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకోసం సమిష్టిగా పనిచేయాలి" అన్నారు.

ఆత్మవిశ్వాసం నింపిన విద్యాశాఖ ప్రకటన

ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్, ప్రతిభావంతమైన టీచర్లు ఉన్నారని, పదోతరగతి ఫలితాలపై ఇటీవల తొలిసారి ప్రభుత్వమే యాడ్ ఇచ్చిందని తెలిపారు. అది పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపిందని అన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనకు వందరోజుల ప్రణాళిక బాగా ఉపకరించిందని అన్నారు. అది అవసరం లేకుండానే ట్రాన్సిషన్ జరిగాలని, ఫౌండేషన్ పకడ్బందీగా ఉండాలని, దానిపై అధికారులంతా శ్రద్ధ వహించాలని సూచించారు.

రెండేళ్లలో రాష్ట్రమంతటా స్మార్ట్ కిచెన్లు

"రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ స్కూళ్ల మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్ ప్రవేశపెట్టాం. దీనిపై అధికారులు ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది. క్రిటికల్ ఇన్ ఫ్రా కోసం ప్రభుత్వం నుంచి నిధులిస్తున్నాం. ఇందుకోసం అవసరమైతే దాతల సహకారం తీసుకోండి. ప్రతి పాఠశాలకు లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింటింగ్స్, డ్రింకింగ్ వాటర్, టాయ్ లెట్, బెంచిలు కచ్చితంగా ఉండాలి. బేసిక్ ఇన్ ఫ్రా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలన్నదే మా ధ్యేయం. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కడపలో స్మార్ట్ కిచెన్ అద్భుతంగా చేశారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రం మొత్తం స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం" అని అన్నారు.

ఇంటర్నేషనల్ స్కూలుగా నిడమర్రు పాఠశాల

మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు స్కూలును ఇంటర్నేషనల్ స్కూలుగా తీర్చిదిద్దుతున్నామని లోకేశ్ తెలిపారు. అక్కడ తొలిసారి నో అడ్మిషన్ బోర్డు పెట్టారని అన్నారు. నెల్లూరులో కూడా రెండు స్కూల్స్ ను మంత్రి నారాయణ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక పాఠశాలను మోడల్ స్కూలుగా తీర్చిదిద్దాలని అధికారులను కోరుతున్నానని అన్నారు.

అమెరికాలో స్కూల్ డిస్ట్రిక్ట్ అనే కాన్సెప్ట్ అమలులో ఉందని అన్నారు. నిడమర్రులో మనం కల్పించిన అత్యుత్తమ సౌకర్యాల వల్ల పక్క నియోజకవర్గాల వారు కూడా ఈ నియోజకవర్గానికి తమ బిడ్డల అడ్మిషన్ కోసం నివాసం మార్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇదే పరిస్థితి కల్పించే లక్ష్యంతో పనిచేయాలని అన్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

బోధనపైనే ఉపాధ్యాయులు దృష్టిపెట్టాలి

"నేను విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక అనేక సంస్కరణలు తెచ్చా. ఉపాధ్యాయులు బోధనపైనే దృష్టిపెట్టాలి. అధికారులు అడ్మినిస్ట్రేషన్ పై శ్రద్ధ వహించాలి. లీప్ యాప్ ద్వారా పనివిధానాన్ని మెరుగుపర్చుకోవాలి. గతంలో విజిబిలిటీ లేకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు మొత్తం విధానానికి లీప్ యాప్ కేంద్రంగా ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, మండల, స్కూలు స్థాయిలో ఒకేవిధమైన డేటా ఉండాలి. లక్ష్యసారూప్యత ఉండాలి. డ్యాష్ బోర్డుపై శ్రద్ధపెట్టాలి. ఇదంతా పూర్తయ్యాక పబ్లిక్ డ్యాష్ బోర్డుకు యాక్సెస్ ఇస్తాం. పాల్, ఏఐ బేస్ లెర్నింగ్, ఏఐ ట్యూటర్ త్వరలోనే అమలు చేయబోతున్నాం" అని అన్నారు.

నైతిక విలువలు ముఖ్యం

టెక్నాలజీతోపాటు నైతిక విలువలు చాలా అవసరమని అన్నారు. అందుకే చాగంటి కోటేశ్వరరావు గారికి కేబినెట్ హోదాతో అడ్వయిజర్ గా పెట్టామని తెలిపారు. ప్రతి శనివారం వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్ పై దృష్టిపెట్టాలని అన్నారు. ఒక సోషల్ మీడియా పోస్టులో కొడుకు తల్లిని చంపే పరిస్థితి చూశానని, నైతిక విలువల బోధనతో ఇటువంటి ఘటనలను నివారించే అవకాశముందని అన్నారు. విద్యాశాఖపై పవిత్రమైన బాధ్యత ఉందని అన్నారు. జెండర్ సెన్సిటివిటీ కూడా చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎక్స్ పోజర్ విజిట్స్ ఏర్పాటు చేస్తున్నామని, యోగా, స్పోర్ట్స్ పై శ్రద్ధ పెడుతున్నామని వెల్లడించారు. స్పోర్ట్స్ కిట్స్ ఇస్తున్నామని, శాప్ ద్వారా స్పోర్ట్స్ కాంపిటీషన్స్ పెడుతున్నామని అన్నారు. విద్యాశాఖ వద్దని చాలామంది తనను వారించినా సమాజంలో తాను ఆశించిన మార్పు విద్యతోనే సాధ్యమని నమ్మి ఈ శాఖను తీసుకున్నానని అన్నారు. నూరుశాతం ఫలితాలు సాధించినపుడే విద్యాశాఖ మంత్రిగా సంతృప్తి చెందుతానని వ్యాఖ్యానించారు. అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ పై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించాల్సిన పవిత్ర బాధ్యత మనందరిపై ఉందని మంత్రి లోకేశ్ చెప్పారు.

రెండేళ్లలో విద్యావ్యవస్థలో అనూహ్య మార్పులు

హెచ్ఆర్డీ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ, పాఠశాల విద్య భవిష్యత్ కార్యాచరణ గురించి ఈ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. గత రెండేళ్లలో పాఠశాల విద్యావ్యవస్థలో మునుపెన్నడూ చూడని సంస్కరణలు చూసినట్లు చెప్పారు. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని అన్నారు. అనేకసార్లు మంత్రి లోకేశ్ రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షించి దశ, దిశ నిర్దేశించినట్లు చెప్పారు. ఒక్కోసారి ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సమావేశాలు నిర్వహించారని తెలిపారు. వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు నిరంతరం చర్చలు జరిపారని అన్నారు. రెండేళ్లలో విద్యాశాఖలో గుణాత్మకమైన మార్పులు తెచ్చిన మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

కఠినమైనప్పటికీ వాస్తవాన్నే చెబుదామని, మంత్రి ఇచ్చిన ధైర్యంతోనే ఇప్పటివరకు ముందుకు సాగామని పేర్కొన్నారు. కొంతవరకు సఫలీకృతమయ్యామని, ఇప్పుడు మనం సంస్కరణల దశ నుంచి కన్సాలిడేషన్ వైపు వెళుతున్నామని తెలిపారు. ఈ స్థితిలో ఎదుగుతున్న మొక్కను మనం సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునే వరకు నిర్విరామంగా కృషిచేయాలని అన్నారు. లక్ష్యాలపై క్లియర్ డెడ్ లైన్ పెట్టుకొని జవాబుదారీతనంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి తమీమ్ అన్సారియా, ఇతర రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఇక బయోమెట్రిక్ అక్కర్లేదు..
## రేషన్ పంపిణీపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి -** ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గుజరాత్‌లోని నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఈ విధానాన్ని, త్వరలోనే రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నంలలో కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సీబీడీసీ విధానం ప్రకారం.. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ వ్యాలెట్ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ డబ్బును డిజిటల్ రూపాయి రూపంలో నేరుగా లబ్ధిదారుల వ్యాలెట్‌కు జమ చేస్తుంది. లబ్ధిదారులు ఆ డిజిటల్ డబ్బుతో రేషన్ దుకాణాల్లో తమకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేయవచ్చు. ఈ విధానంలో బయోమెట్రిక్ అవసరం కూడా ఉండదు. దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ ఎంత వస్తుందో లబ్ధిదారులకు, తమ మార్జిన్ ఎంత వస్తుందో డీలర్లకు స్పష్టత ఉంటుందని మంత్రి వివరించారు. రేషన్ పంపిణీతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కింద ఇకపై సన్న బియ్యానికి బదులుగా నాణ్యమైన స్టీమ్డ్ రైస్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారన్నారు. అలాగే, రాష్ట్రం నుంచి 2 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఇవేకాకుండా, వినియోగదారులకు తక్కువ ధరలకే నిత్యావసరాలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మినీమార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఏపీకి గర్వకారణమైన అరకు కాఫీని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మిలటరీ క్యాంటీన్లలో విక్రయించేందుకు ఎన్‌సీసీఎఫ్ (నేషనల్ సెంట్రల్ కోఆపరేటివ్ ఫెడరేషన్) అంగీకరించిందని మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.

### 'వర్క్ ఫ్రమ్ హోమ్' అని చెప్పి- తెల్లవారుజామున 8వేలమందిని తీసేసిన 'మెటా'

**మొదటిపేజీ తరువాయి -** ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మెటా ప్రకటించింది. ఈ ప్రక్రియను వ్యూహాత్మకంగా అమలు చేసింది. అమెరికా, బ్రిటన్‌తో సహా పలు దేశాల్లోని ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేయాలని సూచించింది. ఆ తర్వాత టైమ్ జోన్ల ఆధారంగా ఉద్యోగులకు లేఆఫ్ మెయిల్స్ పంపించింది.

ఉదయం 4 గంటలకే మెయిల్స్ మొదట సింగపూర్ హబ్‌లోని ఉద్యోగులకు తెల్లవారుజామున 4 గంటలకే ఉద్యోగం నుంచి తీసేసినట్లు మెయిల్స్ వెళ్లాయి. ఆ తర్వాత మిగతా దేశాల్లోని వారికి లేఆఫ్స్ మెయిల్స్ అందాయి. కార్యాలయాల్లో ఉద్రిక్తతల నివారణకు మెటా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో మరో 7 వేల మంది ఉద్యోగులను ఏఐ ఆధారిత విభాగాలకు బదిలీ చేయనుంది. అయితే, భవిష్యత్ లో ఏఐకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మెటా నిర్ణయించినట్లు తెలుస్తోంది. మెటా సంస్థ ఈ ఉద్యోగులను నాలుగు కొత్త ఏఐ కేంద్రిత విభాగాల్లో పునర్వ్యవస్థీకరించనుంది. కంపెనీ అంతర్గతంగా ఏప్రిల్ నెలలో విడుదలైన మెమోలో ఈ విషయాలను ఇప్పటికే వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మరోవైపు, మెటా హెడ్ ఆఫ్ పీపుల్ 'జానెల్ గేల్' ఈ మార్పులపై మెమోలో ఈ విధంగా పేర్కొన్నారు. 'సంస్థను మరింత సమర్థవంతంగా నడిపించేందుకు, ఏఐ రంగంలో పెట్టుబడులను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. ఇది సులభమైన నిర్ణయం కాదు. సంస్థకు ఎంతో సేవలందించిన ఉద్యోగులను విడిచిపెట్టాల్సి రావడం బాధాకరం' అని ఆమె పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి.

ఏఐ సామర్థ్యాల పెంపుపైనే ప్రధానంగా దృష్టి : ఇక, మెటా చేపడుతున్న ఈ మార్పులు కేవలం ఉద్యోగ కోతలకే పరిమితం కావడం లేదు. సంస్థలో ఖాళీగా ఉన్న దాదాపు 6 వేల పోస్టులను కూడా భర్తీ చేయకుండా నిలిపివేయనున్నట్లు సమాచారం. అంటే సంస్థ ఇప్పుడు నియామకాల కంటే ఏఐ సామర్థ్యాల పెంపుపైనే దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం మెటా పరిధిలోని ఫేస్ బుక్ , ఇన్‌స్టాగ్రామ్ , వాట్సాప్ వంటి ప్రధాన ప్లాట్‌ఫారమ్‌లలో ఏఐ వినియోగాన్ని మరింత విస్తరించేందుకు కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మెటా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సుసాన్ లీ ఇటీవల జరిగిన 2026 తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సమావేశంలో మాట్లాడారు. ఏఐ టూల్స్ ద్వారా ఉద్యోగుల ఉత్పాదకతను, ఇంజినీరింగ్ సామర్థ్యాన్ని పెంచడంపై సంస్థ దృష్టి పెట్టిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఏఐ కోసం భారీ పెట్టుబడులు పెట్టేందుకు కూడా మెటా ముందుకొచ్చింది. ఇప్పటికే 2026 సంవత్సరానికి కంపెనీ మూలధన వ్యయాల అంచనాలను మెటా పెంచింది. మొదట 115 బిలియన్ డాలర్ల నుంచి 135 బిలియన్ డాలర్ల మధ్య ఖర్చు చేస్తామని ప్రకటించిన సంస్థ, ఇప్పుడు ఆ అంచనాను 125 బిలియన్ డాలర్ల నుంచి 145 బిలియన్ డాలర్లకు పెంచింది. ముఖ్యంగా డేటా సెంటర్ల విస్తరణ, ఏఐ కోసం అవసరమైన అధునాతన కంపోనెంట్ ధరలు పెరగడం ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది. ఇదిలా ఉండగా, మెటాలో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు కూడా గణాంకాలు చెబుతున్నాయి. 2022లో కంపెనీలో 86,482 మంది ఉద్యోగులు ఉండగా, 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 77,986కు తగ్గింది. 606 మంది ఉద్యోగులకు శాశ్వత లేఆఫ్ ప్రకటించిన 'లింక్డ్ ఇన్' ఇక మరో టెక్ దిగ్గజం లింక్డ్ ఇన్ కూడా ఉద్యోగ కోతల దిశగా అడుగులు వేసింది. న్యూయార్క్ పోస్ట్ నివేదిక ప్రకారం, కంపెనీ 606 మంది ఉద్యోగులకు శాశ్వత లేఆఫ్ నోటీసులు జారీ చేసింది. ఈ తొలగింపులు జులై 13 నుంచి అమల్లోకి రానున్నట్లు సమాచారం.

## ఏడాది తర్వాత మళ్లీ కలవనున్న మోదీ, ట్రంప్..

**మొదటిపేజీ తరువాయి -** ఈ కలయికకు వేదిక కానుంది. ఈ భేటీతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గుతాయో లేదోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. జూన్ 15 నుంచి 17 వరకు ఎవియన్-లెస్-బెయిన్స్‌లో జరిగే ఈ సదస్సులో జీ7 సభ్య దేశాలు కాకపోయినా, ప్రత్యేక ఆహ్వానిత దేశంగా భారత్ పాలుపంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్‌ల మధ్య అధికారికంగా కాకపోయినా, కనీసం అనధికారికంగానైనా ఒక చిన్న సమావేశం (పుల్-అసైడ్ మీటింగ్) జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అనూహ్య శైలిని బట్టి చూస్తే, ఈ భేటీని కొట్టిపారేయలేం.మోదీ, ట్రంప్ చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఆయన్ను కలిసిన తొలి ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు. ఆ సమయంలో మోదీని తన "గొప్ప స్నేహితుడు" అని అభివర్ణించిన ట్రంప్, 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఆ తర్వాత కొద్ది నెలలకే మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి.

## అద్భుతమైన విషయాన్ని కనిపెట్టిన
## చంద్రయాన్ ల్యాండర్.. సీక్రెట్‌గా ఉంచిన ఇస్రో!

**మొదటిపేజీ తరువాయి -** జాబిల్లి నేల గురించి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ నాసా సైతం అబ్బురపడే విషయాలు ఇస్రో ద్వారా వెలుగులోకి వచ్చాయి.

### అనుకోకుండా చిన్న జంప్

చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్ తన ప్రయోగాలు పూర్తి చేసుకునే సమయానికి దానిలో కొంత ఇంధనం మిగిలింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు ముందుగా ప్లాన్ చేయని ఒక సాహసం చేశారు. ఇంజిన్లను మళ్లీ మండించి విక్రమ్‌ను చంద్రుడి ఉపరితలం నుంచి 50 సెంటీమీటర్ల పైకి లేపి పక్కకు కాస్త దూరంలో ల్యాండ్ అయ్యేలా చేశారు. టెక్నాలజీ పరంగా ఇది భారత్‌కు ఒక పెద్ద విజయమైనా సైంటిఫిక్‌గా అంతకంటే పెద్ద రహస్యం దీనివల్ల బయటపడింది.

### కొట్టుకుపోయిన పైపొర

ల్యాండర్ ఇంజిన్లు మళ్లీ మండటంతో ఆ మంటల ధాటికి చంద్రుడిపై ఉన్న 3 సెంటీమీటర్ల పైపొర గాల్లోకి లేచింది. పైన ఎంతో మెత్తగా, దూదిలా ఉండే పొడి మట్టి తొలగిపోవడంతో.. దాని కింద ఎప్పుడూ ఎండ తగలని సరికొత్త మట్టి పొరలు ల్యాండర్‌లోని చాస్టే పరికరానికి చిక్కాయి. ఇలా ఎలాంటి డ్రిల్లింగ్ మిషన్ లేకుండానే చంద్రుడి అంతర్భాగంలో ఉన్న మట్టిని పరిశీలించే అరుదైన అవకాశం శాస్త్రవేత్తలకు దొరికింది.ఈ ప్రయోగం ద్వారా వచ్చిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు చంద్రుడి ఉపరితలం 'కేక్'లా పొరలు పొరలుగా ఉందని తేల్చారు. పైన ఉండే మట్టి ఎంతో వదులుగా, పొడి పిండిలా ఉంటే.. కేవలం 6 సెంటీమీటర్ల లోతులోనే అది తడి జిగురు మట్టిలా చాలా గట్టిగా మారిపోతోంది. అంటే తక్కువ దూరంలోనే నేల స్వభావం పూర్తిగా మారిపోతోందని స్పష్టమైంది. ఈ రకమైన వైవిధ్యం గతంలో అమెరికా అపోలో మిషన్లు వెళ్లిన భూమధ్యరేఖ ప్రాంతంలో ఎక్కడా కనిపించలేదు.నాసా తన ప్రతిష్ఠాత్మక 'ఆర్టెమిస్' మిషన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై మనుషులను దించి అక్కడ శాశ్వత స్థావరాలను నిర్మించాలని చూస్తోంది. చందమామ ఇలా మారుతుందని ఇస్రో కనిపెట్టడం వల్ల.. అక్కడ భవిష్యత్తులో ఇళ్లు కట్టాలన్నా, దిగాలన్నా ఈ పొరల స్వభావం ఎంతో ముఖ్యం. పైగా ఈ పొరలే చంద్రుడి లోపల ఉన్న మంచు గడ్డకట్టేలా కాపాడుతున్నాయని తెలియడంతో భవిష్యత్ మిషన్లకు ఇదొక గైడ్‌లా మారబోతోంది

## ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం
## ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది: మంత్రి కొండపల్లి

ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈరోజు (బుధవారం) ఏపీ ఎన్ఆర్టీ భవన్‌లో మంత్రి కొండపల్లితో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై సలహా కమిటీ సమావేశమైంది. ఏపీలో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం ఏపీలో తెలంగాణ కమిటీ పర్యటిస్తోంది. గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమంపై ఏపీలో అమలవుతున్న పద్ధతులపై తెలంగాణ కమిటీ అధ్యయనం చేస్తోంది.

## టీడీపీ మహానాడులో ఏపీ, తెలంగాణతో పాటు..
## అండమాన్ కు సంబంధించిన తీర్మానం: సోమిరెడ్డి

**మొదటిపేజీ తరువాయి -** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత నిర్వహిస్తున్న తొలి మహానాడు కావడంతో... ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ క్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే ఈ వార్షిక పండుగలో మొత్తం 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని కమిటీ నిర్ణయించినట్లు కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలతో పాటు తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు, అలాగే మహానాడు చరిత్రలోనే తొలిసారిగా అండమాన్ తెలుగు ప్రజల సమస్యలపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతుండటం విశేషం. ఈ సందర్భంగా వైసీపీ పాలనపై సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విధ్వంసానికి మారుపేరుగా మారిందని, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో పౌరులందరూ పూర్తి స్వేచ్ఛతో జీవిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి లోకేశ్ కృషి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోడ్పాటు, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీకి భారీగా పెట్టుబడులు సాధించామని కొనియాడారు. వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో ఘనంగా నిర్వహించాలనుకున్నప్పటికీ, ప్రభుత్వం అనుసరిస్తున్న పొదుపు చర్యల్లో భాగంగానే ఎన్టీఆర్ భవన్ వేదికగా హైబ్రిడ్ (ఆన్‌లైన్ - ఆఫ్‌లైన్) విధానంలో నిర్వహించనున్నామని సోమిరెడ్డి వివరించారు.

## 'మ్యాజిక్ డ్రెయిన్స్ 'ని మరిన్ని గ్రామాల్లో నిర్మించాలి




**మొదటిపేజీ తరువాయి -** గ్రామాల్లోని పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, శ్మశాన వాటికలను ప్రత్యేకంగా సర్వే చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తద్వారా పంచాయతీ భూములకు రక్షణ కల్పించడం సహా ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా కొత్త ఆదాయ వనరులు సృష్టించవచ్చని చెప్పారు. రెండో దశలో 3,580 కిలోమీటర్ల రహదారులు నిర్మాణం : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన సీనియర్ అధికారులతో పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సాధిస్తున్న పురోగతిపై వారు చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, 'పల్లె పండుగ' మొదటి దశలో 4,000 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం పూర్తయిందని, రెండో దశలో 3,580 కిలోమీటర్ల రహదారులు నిర్మించారని తెలిపారు.

### 'పల్లె పండుగ 2.0'లో పూర్తైన పనులు :

సుమారు 37,800 'గోకులాలు' (పశువుల షెడ్లు) నిర్మించారని, పశువుల తాగునీటి అవసరాలను తీర్చడానికి 15,188 నీటి తొట్టెలు కట్టారని, అలాగే లక్షకు పైగా వ్యవసాయ చెరువుల నిర్మాణం పూర్తయిందని ఆయన వివరించారు. మురుగునీటి సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో 59 కిలోమీటర్ల మేర వినూత్నమైన 'మ్యాజిక్ డ్రైన్‌ల'ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో భాగంగా, ఇప్పటికే క్షేత్రస్థాయిలో 32.30 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని అధికారులు పవన్‌కు తెలియజేశారు.

### వినూత్న మురుగునీటి వ్యవస్థ అమలుకు ఆదేశాలు :

ఈ 'మ్యాజిక్ డ్రైన్‌ల' విధానాన్ని మరిన్ని గ్రామాల్లో ప్రవేశపెట్టాలని పవన్ సూచించారు. ముఖ్యంగా నల్లరేగడి నేలలు నీటి నిల్వ ఎక్కువగా ఉండే డెల్టా ప్రాంతాల్లో, అక్కడి స్థానిక నేల పరిస్థితులకు అనుగుణంగా ఈ మ్యాజిక్ డ్రైన్‌లను నిర్మించాలని ఆయన సలహా ఇచ్చారు. పారిశుధ్య స్థాయిలను మెరుగుపరచడానికి, కొండలు, గుట్టల మధ్య ఉన్న మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా ఈ వినూత్న మురుగునీటి వ్యవస్థను అమలు చేయాలని ఆయన నొక్కి చెప్పారు.

### 'జియో-మానిటరింగ్' వ్యవస్థను ప్రవేశపెట్టిన పవన్ :

ఈ పనులు దీర్ఘకాలం పాటు మన్నికగా ఉండేలా చూసుకుంటూనే చేపట్టాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. గ్రామీణ ప్రజలకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన, దీర్ఘకాలం మన్నిక వచ్చే రహదారులను అందించాలనే నిర్దిష్ట లక్ష్యంతో రహదారి నిర్మాణ ప్రాజెక్టుల కోసం ఒక 'జియో-మానిటరింగ్' వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు పవన్ తెలిపారు. ఈ డిజిటల్ విధానం రహదారి పనులను పర్యవేక్షించడంలోనూ, పనుల పునరావృతం కాకుండా నివారించడంలోనూ సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

### బడ్జెట్ పరిమితులకు లోబడి మాత్రమే మంజూరు చేయాలి :

ఉపగ్రహ చిత్రాలు జియో-ట్యాగింగ్ ద్వారా, ఏదైనా నిర్దిష్ట గ్రామం లేదా ప్రాంతంలో క్షేత్రస్థాయిలో రహదారి పనులు ఎంతమేర పూర్తయ్యాయో కచ్చితంగా నిర్ధారించుకోవడం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం నిర్దేశించిన బడ్జెట్ పరిమితులకు లోబడి మాత్రమే మంజూరు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ పరిమితులకు మించి నిధులు మంజూరు చేస్తే, ప్రభుత్వ రికార్డులకు క్షేత్రస్థాయిలో జరిగిన వాస్తవ ఖర్చులకు మధ్య వ్యత్యాసం ఏర్పడుతుందని, తద్వారా నిధుల దుర్వినియోగం జరిగి, ఆడిట్ పరమైన సమస్యలు తలెత్తుతాయని ఆయన హెచ్చరించారు. గ్రామీణాభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యచరణ : ఉపాధి హామీ మార్గదర్శకాల కింద స్పష్టంగా అనుమతించిన పనులను మాత్రమే గ్రామాల్లో చేపట్టాలని ఆయన మరింత స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర' కార్యక్రమ లక్ష్యాలకు అనుగుణంగా, ఎదీ-+=ూవీ చట్టంలోని నిబంధనలను వినియోగించుకుంటూ గ్రామీణాభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయడానికి తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ పాల్గొన్నారు.

## తమిళ రాజకీయాల్లో కీలక పరిణామాలు..
## విజయ్ కేబినెట్‌లో చేరనున్న వీసీకే?

**మొదటిపేజీ తరువాయి -** దక్కవచ్చనే ఊహాగానాలు బలపడ్డాయి. ప్రభుత్వ ఏర్పాటు సమయంలో రాజకీయ స్థిరత్వం కోసం కేంద్రంలోని బీజేపీ జోక్యాన్ని నివారించేందుకే టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్నామని వీసీకే గతంలో ప్రకటించింది. అయితే, తాజాగా ఏఐఏడీఎంకే రెబల్ శాసనసభ్యులను మంత్రివర్గంలోకి తీసుకోబోమని టీవీకే నాయకత్వం తనకు స్పష్టమైన హామీ ఇచ్చిందని తిరుమావళవన్ మీడియాకు తెలిపారు. ఒకవేళ ఏఐఏడీఎంకే అసమ్మతి నేతలను ప్రభుత్వంలోకి తీసుకుంటే, తమ మద్దతుపై పునరాలోచించాల్సి వస్తుందని గతంలో ఆయన హెచ్చరించిన నేపథ్యంలో టీవీకే ఇచ్చిన ఈ హామీకి ప్రాధాన్యత ఏర్పడింది. వీసీకేను ప్రభుత్వంలో భాగస్వామిని చేయాలన్న టీవీకే ఆకాంక్షను బహిరంగంగా తెలియజేసిన మంత్రి ఆధవ్ అర్జునకు తిరుమావళవన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో 'ఎల్లోరుక్కుమాన తలైవర్ అంబేద్కర్ ' పుస్తకావిష్కరణ సభలో రాజకీయంగా కలిసి పనిచేయాలని విజయ్ తమ పార్టీని బహిరంగంగా ఆహ్వానించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అప్పటి ఎన్నికల పరిస్థితుల కారణంగా టీవీకే కూటమిలో చేరలేకపోయినా, విజయ్ ప్రకటనను ఒక ముఖ్యమైన రాజకీయ సంకేతంగా భావించామని అన్నారు. అధికారంలో భాగస్వామ్యం పొందడం తమ పార్టీ చిరకాల రాజకీయ ఆకాంక్ష అని తిరుమావళవన్ పేర్కొన్నారు. గతంలో డీఎంకే కూటమిలో ఉన్నప్పుడు, ఆ పార్టీకి పూర్తి మెజారిటీ ఉండటంతో అధికారంలో వాటా అడిగే అవకాశం పరిమితంగా ఉండేదని గుర్తుచేశారు. "మేము కేవలం రెండు సీట్లు గెలిచినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇచ్చాం. మంత్రి పదవులు డిమాండ్ చేయలేదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంలో చేరడం కూడా తమ రాజకీయ దార్శనికతలో భాగమేనని, దీనిపై పార్టీ జనరల్ సెక్రటరీలు, కోశాధికారి, ఇతర సీనియర్ నేతలతో విస్తృతంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. కాగా, ఈ నెల 8న జరిగిన పార్టీ ఉన్నతస్థాయి వర్చువల్ సమావేశంలో కూడా మెజారిటీ సభ్యులు ప్రభుత్వంలో చేరేందుకే మొగ్గు చూపినట్లు సమాచారం.

## విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ ఆర్ బీఎం
## మినహాయింపు ఇవ్వండి : నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్

**మొదటిపేజీ తరువాయి -** మరోవైపు రాష్ట్రంలోని విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులను వివరించిన భట్టి విక్రమార్క, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదిత ప్రాజెక్టులకు ఎఫ్ ఆర్ బీఎం పరిమితి మినహాయింపు కోరారు.

కేంద్రానికి కృతజ్ఞతలు :

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన డిప్యూటీ సీఎం, తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్ఏఎస్‌సీఐ కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం, విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ ఆర్ బీఎం మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. సాస్కీ కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు :

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయినప్పటికీ 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్‌వీపీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు : అయినా విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని ప్రస్తావించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు నిర్మలా సీతారామన్ కి తెలిపారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని కేంద్రమంత్రికి వివరించారు. విద్యారంగ రూపాంతరానికి రూ.30,000 కోట్లు : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ రూపాంతరానికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని ప్రస్తావించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

## మధ్యాహ్నం వేళ ప్రయాణాలు మానుకోండి

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎండల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను భారీగా అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. వడదెబ్బకు గురైన బాధితులకు ఆసుపత్రుల్లో తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశిస్తూనే, పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌కు స్థలం కేటాయింపుపై కలెక్టర్‌తో ఎమ్మెల్యేల చర్చ



ఉత్తరాంధ్ర ప్రతినిధి మే 20 యువతరం న్యూస్ : ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ శాసనసభ పక్ష నాయకుడు పి విష్ణుకుమార్ రాజు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ కేంద్రానికి స్థలం కేటాయింపు అంశంపై చర్చించారు. క్లబ్ కార్యకలాపాలకు అనువైన స్థలం కేటాయించాలని కోరగా, జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళి ప్రసాద్, బాలాజీ, కన్య గురుమూర్తి, బుల్లిబాబు, కంటిపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఎర్రమఠం గూడెంలో మౌలిక వసతులు కల్పించాలి

## జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నాగరాజులి





కొత్తపల్లి మే 20 యువతరం న్యూస్ : ఎర్రమఠం చెంచుగూడెంలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు ఈ సందర్భంగా చెంచుగుడాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూ చెంచుగూడెంలో జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికి త్రాగునీరు కల్పించే విషయంలో పైప్ లైన్ వేసి కుళాయిలు బిగించారు గాని కరెంటు బోర్డు రెండు నెలల కింద కాలిపోయిన ఇంతవరకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అటువైపు పోయిన పాపాన లేదని ఎక్కడో కొండల్లో నుంచి ఎర్ర మఠం గ్రామానికి వెళుతున్న నీటిని వాడుకొని కాలం ఎల్ల తీస్తున్నారని ఆయన అన్నారు. చాపల లైసెన్సులు ఆ శాఖ అధికారులు రెన్యువల్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వారు అన్నారు వెంటనే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఎర్రమఠం చెంచుగుడాన్ని సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని లేనిపక్షంలో ఈ విషయాలపై గౌరవ శాసనసభ్యులు గిత్త జయ సూర్య గారికి గౌరవ జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు

# రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలి

## వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం




కొత్తపల్లి మే 20 యువతరం న్యూస్ :రైతులు వ్యవసాయ సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి అమ్మిరున్నిసా బేగం సూచించారు.ఆమె బుధవారం మండల కేంద్రం కొత్తపల్లిలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటలలో యూరియా వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. రసాయన ఎరువులు అవసరం మేరకే వాడాలన్నారు. రాయితీపై యంత్ర పరికరాలు ఈనెల 26 వరకు దరఖాస్తు నమోదు పెంచారన్నారు. కావున అవసరమున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాసులు రైతు సేవ సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య





కొత్తపల్లి మే 20 యువతర న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల ప్రత్యేక అధికారి చింతామణి అన్నారు. ఆమె బుధవారం మండల కేంద్రం కొత్తపల్లి లో తాసిల్దార్ ఉమారాణి ఎంపీడీవో మేరీ తో కలిసి మండల విద్యాధికారి 2 ఇనాయతుల్లా ఆధ్వర్యంలో మండల కేంద్రం కొత్తపల్లి లో బడిపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేరిపించాలని ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి చింతామణి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు వంటి సదుపాయాలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అర్హత కలిగినవారై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని చెప్పారు. అంగన్వాడిలో ఉన్న ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను మండలం వ్యాప్తంగా 280 మంది విద్యార్థులను ఒకటవ తరగతి చేర్పించామన్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు తల్లికి వందన ఆర్థిక సహాయం, విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలు వివరించారు. బుధవారం 13 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులలో మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ,వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఉత్తరాంధ్ర సకల కళ సమితి ఉదారత

## మరణించిన తోటి కోలాటం గురువు సురేంద్ర కుటుంబానికి లక్షా యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయం

అనకాపల్లి బ్యూరో ఇంచార్జ్ మే 20 యువతరం న్యూస్: చోడవరం మండలం లక్కవరం గ్రామంలో 4నెలల ముందు కోలాటం గురువు బొడ్డు.సురేంద్ర మరణించగా వారి కుటుంబానికి సాటి కోలాటం గురువులు అందరూ కలసి ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర సకల కళ సమితి ద్వారా లక్షా యాభైవేల సేకరించి బొడ్డు.సురేంద్ర దినకార్యం రోజున 50 వేలు అందించారు.... కోలాటం గురువు మరణించే నాటికి 8 నెలల గర్భవతిగా ఉన్న ఆయన భార్య రెండు నెలల క్రితం పాప కు జన్మనివ్వడం తో......నేడు ఉత్తరాంధ్ర సకల కళ సమితి ఆధ్వర్యం లో మిగిలిన ఒక లక్ష రూపాయలు ఆ పాప మనస్విని పేరు మీద బ్యాంక్ లో వేసి కోలాటం గురువులు తమ ఉదారత ను చాటుకున్నారు.... ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా చోడవరం సర్కిల్ ఇనస్పెక్టర్ అప్పలరాజు మరియు లక్కవరం సర్పంచ్ పాల్గొన్నారు....

ఈ కార్యక్రమంలో కోలాటం గురువులు

ఉత్తరాంధ్ర సకలకల సమితి గ్రూప్ అడ్మిన్ మామిడి.దాళినాయుడు(అడ్డూరు కోలాటం గురువు), గ్రూప్ అధ్యక్షులు కర్రి రాజు, ఉపాధ్యక్షులు గేదెల కరుణాకుమార్, కార్యదర్శి పట్నూరి ప్రసాద్ , సహాయ కార్యదర్శి అయితంశెట్టి జగదీష్, సెక్రటరీ పంచుకోట వెంకటలక్ష్మి, గ్రూప్ మెంబెర్స్ లోవరాజు , కోటి తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు...



# ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ ఉద్యోగులతోనే నిర్వహించాలి

## వాల్తేరు డిపో గేట్ మీటింగ్‌లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ డిమాండ్

ఉత్తరాంధ్ర ప్రతినిధి మే 20 యువతరం న్యూస్ : రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం వాల్తేరు డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ అధ్యక్షులు ఎ.కె. శివాజీ హాజరై ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ప్రభుత్వం స్వయంగా కొనుగోలు చేసి, ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి బస్సుల్లో జీరో టికెట్ విధానాన్ని నిలిపివేసి, మహిళలు టికెట్ తీసుకోకుండా ఉచితంగా ప్రయాణించే విధానం అమలు చేయాలని సూచించారు. ఉద్యోగులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించేందుకు కొత్త టీంలను ఏర్పాటు చేయాలని కోరారు.



అదేవిధంగా పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. గౌరవ ఎండీకి సమర్పించిన మెమోరాండంలో పేర్కొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బస్సులను వెంటనే కొనుగోలు చేయాలని, అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేయాలని, రిటైర్ అయిన మరియు మరణించిన ఉద్యోగుల సెటిల్‌మెంట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులను ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి గతంలో అమలులో ఉన్న ఆర్టీసీ వైద్య సదుపాయాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ సమావేశానికి వాల్తేరు డిపో అధ్యక్షులు ఆర్. వసంతరావు అధ్యక్షత వహించి ఉద్యోగులను చైతన్యపరిచారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పీజీ పతి, ఎస్.ఎం. నాయుడు, డీఎస్ఆర్ రాజు, గ్యారేజీ అధ్యక్షులు, కార్యదర్శులు, సీసీఎస్ డెలిగేట్ కేటీ రావు తదితర యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల ప్రతిభకు ఘన సత్కారం



## ప్రభుత్వ పాఠశాలల వైపు పెరుగుతున్న విద్యార్థుల ఆకర్షణ : ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

ఉత్తరాంధ్ర ప్రతినిధి మే 20 యువతరం న్యూస్ : పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జనసేన ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఘనంగా సత్కరించారు. సుజాతనగర్‌లో నిర్వహించిన కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 39 మందిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తూ సమాజానికి ప్రతిభావంతులైన పిల్లలను అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన పంచకర్ల రమేష్ బాబు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలు, ఆహారం, వసతుల గురించి తెలుసుకున్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన జరుగుతోందని, వసతులు అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులు చెప్పడంతో ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను వేదికపై మాట్లాడించి వారి ప్రతిభను ప్రోత్సహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎన్నడూ లేని విధంగా ఫలితాలు సాధించారని, పెందుర్తి నియోజకవర్గంలో 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ ఫలితాలు ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అప్పలరాజు, పద్మజ, రమేష్ నాయుడు, మాలతి నగేష్, అయిత సింహాచలం, గొర్లి రామనాయుడు, శైలజ, లక్ష్మణరావు, సువర్ణ, రమణజీ, చంద్రమౌళి, మీనా వెంకటేశ్వరరావు, సన్యాసినాయుడు, శంకర్రావు, ఇందల రమణ, జగన్మోహన్ పాత్రుడు, కొరుపోలు రామనాయుడు, కనకరాజు, గల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి నిర్లక్ష్యం సహించము

## ప్రతి రోగి వివరాలను ఆబా పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి.

## ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

## జిల్లా కలెక్టర్ డాక్టర్. ఏ.సిరి.

కర్నూలు ప్రతినిధి మే 20 యువతరం న్యూస్ : రోగులకు మెరుగైన వైద్యం అందించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని, ప్రతి రోగి వివరాలను ఆబా పోర్టల్ లో తప్పకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ఔషధాల నిల్వలు, వ్యాక్సినేషన్ మందుల అందుబాటు, ఫార్మసీ నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



ముఖ్యంగా వ్యాక్సినేషన్‌కు సంబంధించిన మందుల నిల్వలు, వాటి వినియోగ విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి రోజువారీగా ఎంతమంది ఓపీకి వస్తున్నారు? ఏ రకాల వ్యాధులతో చికిత్స కోసం ప్రజలు వస్తున్నారు? అనే అంశాలపై వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆరా తీశారు. దీనికి స్పందించిన వైద్యాధికారులు రోజుకు సుమారు 30 నుంచి 50 మంది వరకు ఓపీకి వస్తున్నారని తెలిపారు. ప్రధానంగా బీపీ, షుగర్, ఒళ్ళు నొప్పులు, కుక్క కాటు కేసులు, వడదెబ్బలకు సంబంధించిన సమస్యలతో ప్రజలు చికిత్స కోసం వస్తున్నారని వివరించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రోగి వివరాలను ఆబా (ఏబిఎచ్ఏ) పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఆరోగ్య సేవల్లో డిజిటల్ నమోదు విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, రోగుల ఆరోగ్య సమాచారం సమగ్రంగా నమోదైతే భవిష్యత్తులో మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు మరియు వారి కుటుంబ సభ్యులతో కూడా కలెక్టర్ మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారని, చికిత్స సంతృప్తికరంగా ఉందని ప్రజలు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# వెదురుసాగుతో రైతులకు లాభాల పంట

## డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి



కొత్తపల్లి మే 20 యువతరం న్యూస్: వెదురు సాగు నేడు వ్యవసాయ రంగంలో ఒక లాభదాయకమైన పంట అని వెదురు సాగుతో అధిక లాభాలు పొందవచ్చని డి ఆర్ డి ఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రం కొత్తపల్లిలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య ఆధ్వర్యంలో వెదురు ఉప రంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదురు సాగు అనేది రైతులకు అదనపు జీవనోపాధిగా ఉంటుందన్నారు. కేవలం 36 సెంట్లు నుంచి ఒక ఎకరం వరకు వెదురు నాటుకోవచ్చని. వెదురు సాగుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తాయన్నారు. వెదురు మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వరకు పంట దిగుబడి ఇస్తుందన్నారు. ఉపాధి హామీ ద్వారా 37000 మరియు ఉద్యాన శాఖ ద్వారా 17000 వస్తున్నారు. కొత్తపల్లె మండలానికి 650 మంది రైతులను గుర్తించి వెదురు సాగు చేసుకునేలా ప్రోత్సహించి జీవనోపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ లు సురేష్ రంగారావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ వెంకటరమణ మరియు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు

# వాహనాలు,తనిఖీ,మరియు,సైబర్,నేరాలపై,ప్రజలకు,అవగాహన







## అమడగూరు,ఎస్సై గోపాలకృష్ణ

అమడగూరు మే 20 ( యువతరం న్యూస్) : అమడగూరు, మండలం తుమ్మల పంచాయతీ,వెంకట్ నారాయణ పల్లి క్లాసులో వాహనాలు,తనిఖీ,నిర్వహించారు అలాగే తుమ్మలలో సమాజంలో జరుగుతున్న నేరాలపైన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేరాలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడాలని ఎస్ఐ గోపాల్ కృష్ణ తెలిపారు బుధవారం,మండలంలో తుమ్మల,గ్రామంలో ప్రజలందరిని సమావేశపరిచి గ్రామ ప్రజలకు అవగాహన నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళల భద్రత మాదకద్రవ్యాలు వలన కలిగే నష్టాలను సైబర్ నేరాలు రోడ్డు నియమ నిబంధనలు శక్తి యాప్ డిజిటల్ మోసాలు మహిళలు బాలికలపై జరిగే నేరాలు డ్రంక్ అండ్ డ్రైవ్ బాల్యవివాహాలు పోక్సో కేసులు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు ఈవ్,టీజింగ్ తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామంలోని ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఎలాంటి ఫేక్షన్ గొడవలకు సాంఘిక కార్యకలపాల జోలికి పోవద్దని పిల్లలను ఉన్నత చదువులు చదివించే ప్రయోజకులను చేయాలని తెలిపారు అపరిచితులు ఎవరైనా మీ ప్రాంతంలో కనబడనట్లయితే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని తెలిపారు ప్రస్తుతం సమాజంలో అంతర్జాల మోసాలు అధికమయ్యాయని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు వాహనదారులు వాహనాలకు సంబంధించిన సంబంధిత డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నాయా లేదో చూచుకోవాలని స్వీట్ బెల్టును తప్పక పెట్టుకోవాలని ద్విచక్ర వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండి శిర,శాస్త్రాన్ని కచ్చితంగా ధరించాలని తెలిపారు ప్రజలు భద్రత పోలీసులు బాధ్యతని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సై గోపాలకృష్ణ పోలీస్ సిబ్బంది గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు

# బుక్కరాయసముద్రంలో మంచినీటి సమస్య పరిష్కరించాలి

**సిపిఎం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద భారీ ధర్నా...**



బుక్కరాయసముద్రం మే 20 యువతరం న్యూస్ :- బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఇస్లాంపూర్, గౌరయ్యచేను కొట్టాలు, న్యూ ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పూసల కాలనీ, జగనన్న కాలనీలలో తీవ్రంగా ఉన్న మంచినీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఈరోజు సిపిఎం బుక్కరాయసముద్రం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సుమారు 200 మందితో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం మండల కార్యదర్శి ఆర్. కుల్లాయప్ప అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనంతపురం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రంలోనే మంచినీటి సమస్య తీవ్రంగా ఉండడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ముఖ్యంగా ఇస్లాంపూర్, గౌరయ్యచేను కొట్టాలు, న్యూ ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పూసల కాలనీ, జగనన్న కాలనీలలో గత నాలుగు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తున్నప్పటికీ సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇటీవల జరిగిన ఊరి దేవర సమయంలో కూడా మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. చెరువులో నీళ్లు ఉన్నా, ట్యాంకులు నింపుతున్నా కాలనీలకు నీరు అందకపోవడం పరిపాలనా వైఫల్యమని పేర్కొన్నారు. “నీళ్లైనా ఇవ్వండి... టిష్యూ పేపర్ అయినా ఇవ్వండి” అని ప్రజలు అడగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. తాత్కాలికంగా కొన్ని మంచినీటి ట్యాంకుల ద్వారా సరఫరా చేసి తర్వాత వదిలేయడంతో సమస్య అలాగే కొనసాగుతోందని, కొన్ని ప్రాంతాల్లో ప్రజలే తమ డబ్బులతో పైపులైన్లు వేసుకోవాలని చెప్పడం అన్యాయమన్నారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు కడుతున్న ప్రజలకు తాగునీరు అందించడం గ్రామపంచాయతీ బాధ్యత అని స్పష్టం చేశారు. అలాగే గౌరయ్యచేను కొట్టాలలో వోల్టేజ్ సమస్య ఏళ్ల తరబడి కొనసాగుతోందని, ప్రస్తుతం రెండు అదనపు ట్రాన్స్ఫార్మర్లు మంజూరైనప్పటికీ వాటిని ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇస్లాంపూర్ కాలనీలో విద్యుత్ తీగలు ఎప్పుడు ఇళ్లపై పడతాయో తెలియని ప్రమాదకర పరిస్థితి ఉందన్నారు. ఇందిరమ్మ కాలనీలో మూడు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోయినా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారని, శాశ్వత పరిష్కారం చేయలేదని విమర్శించారు. గ్రామపంచాయతీలో డ్రైనేజీ కాలువలు శిథిలావస్థకు చేరి మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, వెంటనే కొత్త డ్రైనేజీ కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో సదాశివకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మంచినీటి సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, ఇతర సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. సకాలంలో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పుల్లయ్య, సంజీవరెడ్డి, చిన్న రాముడు, పెద్ద రాముడు, లక్ష్మీదేవి, అబ్దుల్ రజాక్, హుస్సేన్, చిట్టెమ్మ, సుజాత, నాగమ్మ, నాగలక్ష్మి, లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# డోన్ లో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నియోజకవర్గం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల







(డోన్ ప్రతినిధి మే 20 యువతరం న్యూస్) : డోన్ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి,వివిధ శాఖల అధికారులతో కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో, తాసిల్దార్, ఎంపీడీవోలతో పాటు నేషనల్ హైవే అథారిటీస్,ఇరిగేషన్, ఫారెస్ట్,రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, ఇంజినీర్లు మరియు డోన్,బేతంచర్ల,ప్యాపిలి మండలాలకు సంబంధించిన విభాగాల అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యే అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రజలు మరియు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించిన ఎమ్మెల్యే శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా ప్రస్తుత సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకుని,వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కోట్ల సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మానవత్వం పరిమళించే మంచి మనసులకు స్వాగతం



కీ॥శే॥ అయితాబత్తుల వెంకట్ జశ్వంత్

ఒకటవ తరగతి చదువుతున్న ఆరేళ్ల పసి బాలుడు అయితా బత్తుల వెంకట జశ్వంత్ మోటార్ సైకిల్ ప్రమాదంలో మృతి చెందడం హృదయ విదా రకం/ఆ చిన్నారి జస్వంత్ కుటుంబానికి అండగా నిలుస్తూ కీర్తిశేషులు మధుర సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందజేయడం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం/ బాధలో ఉన్న కుటుంబానికి భరోసా ఇచ్చిన కీర్తిశేషులు మధుర సత్యనారాయణ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతా కవితా వందనాలు/ ఈ లోకం నుండి మనిషి వెళ్ళిపోయినా మానవత్వం మిగిలితేనే ఆ జీవితం చిరస్థాయిగా నిలుస్తుంది అనడానికి ఇది ఒక ఉదాహరణ/ కన్నీటి బాధలో అండగా నిలవడం గొప్ప మానవత్వం చిన్నారి జస్వంత్ కుటుంబానికి అందించిన సాయం అభినందనీయం ఆపదలో చేయుత నిజమైన సేవ/ పసి నవ్వు ఆగిపోయిన ఇంట విషాదం నిండినా బాధలో ఉన్న కుటుంబానికి భరోసాగా మేమున్నామని నిలిచిన కీర్తిశేషులు మధుర సత్యనారాయణ కుటుంబ సభ్యుల మంచి హృదయాలకు స్వాగతం సుస్వాగతం/ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ అందించిన ఆర్థిక సాయం మానవత్వానికి కొత్త చిరునామా/ బాలుడు జశ్వంత్ ఇంట్లో పేరాయి చెరువు ఏటి మేరక ఊరి జనం కళ్ళల్లో కన్నీటి వేళ చేయూత నిచ్చిన కీర్తిశేషులు మధుర సత్యనారాయణ కుటుంబ సభ్యుల దాతృత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు/ వారి బాధను తమ బాధగా పంచుకున్న మంచి హృదయాలకు స్వాగతం పసి బాలుడి కుటుంబానికి అండగా నిలవడం మహోన్నత దాన గుణం/ మనసున్న మనుషులు ఉన్నంత కాలం మానవత్వం బతికే ఉంటుంది సాయం చేసిన చేతులే సమాజానికి స్ఫూర్తిదాయకం/ కీర్తిశేషులు మధుర సత్యనారాయణ కుటుంబ సభ్యులు చేసిన సేవా స్ఫూర్తి చిరస్మరణీయం/ నడక కవి, అక్షర ప్రవీణ నల్లా నరసింహమూర్తి సీనియర్ తెలుగు లెక్చరర్ శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత కునసాల వారి వీధి

# నిర్మాణాలు పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను సొసైటీ లకు అప్పగించాలి

**నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న ఎంపీఎఫ్‌సీ లను త్వరితగతిన పూర్తి చేయాలి.**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**







కర్నూలు ప్రతినిధి మే 20 యువతరం న్యూస్: నిర్మాణాలు పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను సొసైటీ లకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ కు సంబంధించిన జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డీఎల్ఐసీ) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న 23 ఎంపీఎఫ్‌సీ లను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెటింగ్ ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. 50 గోదాముల నిర్మాణాలు పూర్తయినప్పటికీ కేవలం 5 మాత్రమే సొసైటీ లకు స్వాధీనం చేశారని, త్వరితగతిన మిగిలిన సెంటర్లను కూడా హ్యాండోవర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా కో ఆపరేటివ్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో డిసిఓ శిరీష, కే డి సి సి బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వర రెడ్డి, ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ రంగనాథ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం వాల్ పోస్టర్లు రిలీజ్ చేసిన గ్రామస్తులు





కర్నూల్ ప్రతినిధి మే 20 యువతరం న్యూస్:కర్నూలు జిల్లా కర్నూల్ మండలం నూతనపల్లె గ్రామంలో 23 తేదీ శ్రీశ్రీశ్రీ చెన్నకేశవస్వామి కళ్యాణ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని నూతన గ్రామ ప్రజలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం వాల్ పోస్టర్ రిలీజ్ చేసిన గ్రామస్తులు గ్రామాల్లోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రైతులకు పంటలు బాగా పండాలని ఈ కళ్యాణోత్సవం జరుపుకుంటామని నిర్వాహకులు తెలిపారు. ఈ కళ్యాణోత్సవం ఐదు సంవత్సరాలకు ఓసారి నిర్వహిస్తారు. చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు 24-05-2026 నుండి 25-05-2026వరకు నిర్వహించబడును. కావున ఆసక్తి గల టీమ్లు 22-05-2026లోపు తమ టీమ్లను నమోదు చేసుకోవలెను. కోరడం జరిగింది. 24-05-2026 ఆదివారం ఉదయం గం॥ 8-00 లకు ఉమెన్స్ కబడ్డీ పోటీలు (20 సం॥లోపు) నిర్వహించబడును. 25-05-2026 సోమవారం ఉదయం గం॥ 8-00లకు మెన్స్ (హోంటీం) కబడ్డీ పోటీలు నిర్వహించబడును. 25-05-2026 సాయంత్రం గం॥ 4-00లకు గుండు పందెం (120 కేజీలు) నిర్వహించబడును. కబడ్డీ పోటీలో గెలుపొందిన వారిక. మొదటి బహుమతి 30 వేల రూపాయలు రెండో బహుమతి 20000 రూపాయలు మూడో బహుమతి పదివేల రూపాయలు నాలుగో బహుమతి 5000 రూపాయలు బహుతిగా నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు దామోదరం అయ్యస్వామి, టి. చిన్న టి. వినోద్ కుమార్, డి. స్వాములు, టి. రామక్రిష్ణ, మునిస్వామి జమ్మన్న జేయుడు డీలర్ గోవిందు చిన్న ముద్దయ్య

# వెంకాయపల్లి ఎల్లమ్మ దేవాలయ చైర్మన్ గా బోగిని నాగేంద్ర ఎన్నిక

**ఎమ్మెల్యే , విష్ణువర్ధన్ రెడ్డి ని గజమాలతో సత్కరించిన ఆలయ నూతన కమిటీ సభ్యులు**



కోడుమూరు మే 20 యువతరం న్యూస్ : కర్నూలు జిల్లాలో పేరుగాంచిన వెంకాయపల్లి శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం నూతన చైర్మన్ గా శ్రీ బోగిని నాగేంద్ర ను ఎన్నుకున్నారు. అదేవిధంగా పలువురు ఆలయ కమిటీ సభ్యులను సైతం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఇంతటి బాధ్యత అందించినందుకు ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో నా వంతు కృషి చేస్తానని భోగిని నాగేంద్ర ఈ సందర్భంగా మాట్లాడారు. నూతన కమిటీని ఎన్నికలో సహకరించిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని మరియు కేడీసీసీ చైర్మన్ డి. విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,రాజశేఖర్ గౌడ్ , పలువురు కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవడుగూరు పరిధిలో ఇసుక మాఫియాపై నిఘా: నాలుగు ట్రాక్టర్ల సీజ్!



పెద్దవడుగూరు మే 21 యువతరం న్యూస్:మండల పరిధిలోని చిట్టూరు గ్రామం వద్ద పెన్నా నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పెద్దవడుగూరు పోలీసులు బుధవారం రాత్రి రౌండ్ అప్ చేసి సీజ్ చేశారు. ఈ దాడికి సంబంధించిన వివరాలను పెద్దవడుగూరు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) ఆంజనేయులు మీడియాకు వెల్లడించారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్టూరు గ్రామం సమీపంలోని పెన్నా నది పాయల నుండి కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు నిన్న రాత్రి ఎస్సై ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి చిట్టూరు గ్రామ పరిసరాల్లో నిఘా పెట్టారు. నది నుండి ఇసుకను లోడ్ చేసుకుని వస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారులను చూసి ఇసుక అక్రమ రవాణాదారులు పారిపోయే ప్రయత్నం చేసినప్పటికీ, సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. “ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, సహజ వనరులను అక్రమంగా తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక దొంగతనాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించిన ఎస్సై పి, నరేష్



తుగ్గలి,మే 20 (యువతరం న్యూస్): తుగ్గలి మండల కేంద్రంలో ఎస్సై పి, నరేష్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా వాహనాదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పి , నరేష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమని, అలాంటి చర్యలు ప్రాణాంతక ఫలితాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడప రాదని అలా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవణి హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దండువారి పల్లిలో తాడినీటి సమస్య పరిష్కరించాలి

**సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి...**



బుక్కరాయసముద్రం మే 20 యువతరం న్యూస్ :-బుక్కరాయసంద్రం మండలంలోని దండువారి పల్లి లో తాగునీటి సమస్య గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్యని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విన్నవించుకున్న అధికారులు పట్టించుకోవడం లేదు తాగునీటి కోసం గ్రామ చుట్టుపక్కల ఎన్ని బోర్ భావిలు వేసిన నీరు పడటం లేదు అందువలన ప్రజలతోపాటు మూగజీవాలైన పశువులు గొర్లకు తాగునీటి సమస్య అధికంగా ఉంది. మాకు వాటర్ ట్యాంక్ ల ద్వారా సప్లై చేయాలని విన్నపించుకొంటున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని బుధవారం సిపిఐ సింగనమల నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి ఆధ్వర్యంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దాసరి సునీతకు వివరిస్తూ సమస్యని పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో ఆయనతో పార్టీ సిపిఐ నాయకులు తిరుపతయ్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# డోన్ లో వాహనం తనిఖీలలో రూ:77,000/- జరిమానా వేసిన ఆర్టీవో క్రాంతి కుమార్





(డోన్ ప్రతినిధి మే 20 యువతరం న్యూస్) : డోన్ లో ఆర్టీవో ఆఫీస్ వద్ద నిర్వహించిన సాధారణ తనిఖీలలో భాగంగా,వెస్టుబెంగాల్ రాష్ట్రానికి చెందిన టెంపో ట్రావెలర్ 28 సీట్స్ ఔడి37జు2574 ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్యాక్స్ చెల్లించకుండా వెస్టుబెంగాల్ నుండి కర్ణాటక వెళ్తున్న మినీ బస్సు పై కేసు నమోదు చేసి రూ:77,వేల రూపాయలు జరిమానా విధించబడింది.

# ఘనంగా జూ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



పామిడి, మే 20 యువతరం ఈ: పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో టీం తారక్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం జూ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జూ ఎన్టీఆర్ అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీం తారక్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో 77మంది రక్తదానం చేసి అభిమానులు తమ సేవా దృక్పథంను చాటుకున్నారు. టీం తారక్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలపై ప్రజలు అభినందించారు.

# కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలి: ఎ. వెంకటరావు




విజయనగరం ప్రతినిది మే20 యువతరం న్యూస్:బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటరావు అన్నారు.బుధవారం విజయనగరంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన కరువు భత్యం ఇవ్వడం లేదని ఆరోపించారు.కేంద్రం పెన్షనర్ల మధ్య పాత, కొత్త తారతమ్యాలు సృష్టిస్తోందన్నారు.నిర్లక్ష్యం వీడి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నడపాలని నిరసన



విజయనగరం ప్రతినిది మే20 యువతరం న్యూస్:విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారా నడపాలని ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజుందర్ యూనియన్ జోనల్ కార్యదర్శి బి.ఎస్. రాములు డిమాండ్ చేశారు.బుధవారం విజయనగరం ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలియజేశారు.విద్యుత్ బస్సులను ప్రైవేట్ వ్యక్తులకు అప్ప చెప్పరాదన్నారు.ఆర్టీసీలో ఖాళీగా ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ ఉద్యోగాలను భర్తీ చేయాలి.పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో కాలుష్య నియంత్రణ కోసం విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నారు. వీటిని ప్రైవేటుకు ఇస్తే ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు అని యూనియన్లు ఆందోళన వ్యక్తం చేశారు.

# విజయనగరం జిల్లాకు పతకాలు



విజయనగరం ప్రతినిది మే20 యువతరం న్యూస్:మే 15, 16, 17 తేదీలలో తెలంగాణలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు.ఈ క్రీడలో 16బంగారు పతకాలు 9వెండి పతకాలు,కాంస్య పతకాలు సాధించారు.జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గురానా అయ్యలు బుధవారం ఈ విషయాన్ని తెలిపారు. పతకాలు సాధించినందుకు అసోసియేషన్ తరపున అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ అభినందనలు తెలిపారు.తైక్వాండో కొరియన్ మార్షల్ ఆర్ట్. జాతీయ స్థాయిలో 25o పతకాలు సాధించడం విజయనగరం జిల్లాకు గర్వకారణం అని తెలిపారు

# పెద్దకడుబూరు పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.

నేరాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలి.

పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించిన ... జిల్లా ఎస్పీ.




పెద్దకడుబూరు మే 20 యువతరం న్యూస్ :పెద్దకడుబూరు పోలీసు స్టేషన్ ను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నియంత్రణ కు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాల పై, మహిళా చట్టాల పై మహిళలకు , నూతన చట్టాల పై ప్రజలకు అవగాహన చేయాలన్నారు. కర్నూలు ఎస్పీ తో పాటు కోసిగి సిఐ మంజునాథ్ , పెద్దకడుబూరు ఎస్సై మారుతి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల భద్రత మనందరి బాధ్యత

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్.

ఎమ్మిగనూరు వెంకటాపురం కాలనీలో "మీ రక్షణ – మా బాధ్యత" అవగాహన కార్యక్రమం.

మహిళల రక్షణ కోసం "శక్తి యాప్" వినియోగించుకోవాలి.

చట్టాలపై అవగాహన పెరిగితేనే నేరాలు తగ్గుతాయి.






కర్నూలు ప్రతినిధి మే 20 యువతరం న్యూస్ : మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, మహిళల రక్షణ మరియు సైబర్ నేరాల పై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీలో శ్రీ గుంటెప్ప స్వామి దేవాలయం దగ్గర బుధవారం "మీ రక్షణ – మా బాధ్యత" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ ... మహిళల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. మహిళలు ఎటువంటి వేధింపులు, సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెరిగితేనే నేరాలు తగ్గుతాయని పేర్కొన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, నిర్భయ చట్టం వంటి పలు చట్టాలు మహిళల రక్షణ కోసం అమల్లో ఉన్నాయని తెలిపారు. పని ప్రదేశాల్లో లేదా సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న "శక్తి యాప్" వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, 100, 181, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం మహిళల భద్రత కు , మహిళల చట్టాల ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలుంటే పోలీసులకు చేరవేయాలన్నారు. బాల్య వివాహాలు చేయకూడదన్నారు.

**ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి మాట్లాడుతూ...**

మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు లేదా మహిళలపై వేధింపులు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ కె. గంగి రెడ్డి , తహసీల్దార్ శ్రీ శ్రీనివాసులు గారు, ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి, బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నరసింహులు ,టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ మహేష్ ,ఎస్సైలు, గ్రామ మరియు వార్డు సచివాలయ మహిళా పోలీసులు, పొదుపు సంఘాల మహిళలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# వర్షాధార వ్యవసాయానికి పీఎండీఎస్ విధానం వరం ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు సాధ్యం

జిల్లాలో లక్ష ఎకరాల పొలంలో పీఎండీఎస్ వ్యవసాయం లక్ష్యం.

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



కర్నూలు ప్రతినిధి మే, 20 యువతరం న్యూస్ :వర్షాధార వ్యవసాయానికి పీఎండీఎస్ విధానం ఒక వరం లాంటిదని ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు సాధ్యమని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో పీఎండీఎస్ (పీఎండ్స్ – ప్రీ – మొన్సూన్ డ్రై సౌయింగ్ ) విధానం ద్వారా సాగు చేస్తున్న పంటలను జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి , పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు ముందస్తు వర్షాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న పీఎండీఎస్ విధానం వర్షాధార ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ఆంజనేయులు అనే రైతు పొలాన్ని పరిశీలిస్తూ పిఎండిఎస్ పద్ధతిలో సాగు చేస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ పద్ధతిలో సాగు చేయడం ద్వారా తనకు వచ్చిన లాభాల గురించి తోటి రైతులకు వివరించి ఎక్కువ మంది రైతులు పిఎండిఎస్ పద్ధతిలో సాగు చేయించే విధంగా చూడాలన్నారు. ఈ పద్ధతి ద్వారా నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, రసాయన ఎరువుల అవసరం లేకుండానే భూమి సారవంతంగా మారుతుందన్నారు. జిల్లాలోని మిగతా రైతులు కూడా సాంప్రదాయ పద్ధతులతో పాటు ఇలాంటి పీఎండీఎస్ విధానాలపై అవగాహన పెంచుకుని, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. రామేశ్వరమ్మ అనే రైతు పండిస్తున్న మల్లె పంటను కలెక్టర్ పరిశీలిస్తూ జిల్లాలో మల్లె పంట విస్తీర్ణం మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో పీఎండీఎస్ (పి ఎం డి ఎస్ – ప్రీ – మొన్సూన్ డ్రై సౌయింగ్ ) వ్యవసాయ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తూ లక్ష ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించామని, పెండింగ్ లో ఉన్న లక్ష్యాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతులకు ఈ విధానం ప్రయోజనాలు చేరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు.అనంతరం రైతు మోహన్ పొలంలో కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే స్వయంగా పీఎండీఎస్ విత్తనాలను చల్లి రైతుల్లో ఉత్సాహాన్ని నింపారు. వ్యవసాయ రంగంలో కొత్త పద్ధతులను రైతులకు చేరవేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు.కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, న్యాచురల్ ఫార్మింగ్ డిపిఎం మాధురి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కోసిగి పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్



నేరాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలి.

పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించిన ... జిల్లా ఎస్పీ.

కర్నూలు ప్రతినిధి మే 20 యువతరం న్యూస్ :కోసిగి పోలీసు స్టేషన్ ను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాల పై, మహిళా చట్టాల పై మహిళలకు , నూతన చట్టాల పై ప్రజలకు అవగాహన చేయాలన్నారు. కర్నూలు ఎస్పీ తో పాటు కోసిగి సిఐ మంజునాథ్ , కోసిగి ఎస్సై రమేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పెంపుదలకు విస్తృత చర్యలు







జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



వెల్దుర్తి మే 20 యువతరం న్యూస్: జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పెంపుదలకు విస్తృత చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.బుధవారం వెల్దుర్తి మండలంలో నిర్వహిస్తున్న జలధార--జలహారతి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నాగులవంకలో చేపట్టిన పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జలధార-జలహారతి కార్యక్రమం కింద 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభించడం జరిగిందన్నారు. భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా చెరువులని ఫీడ్ చేసే కాలువలు, వంకలు, వాగులు, బుష్ క్లియరెన్స్ లాంటివి క్లియర్ చేయడం జరుగుతుందన్నారు. వెల్దుర్తి ఫీల్డ్స్ నుంచి వచ్చే క్యాచ్‌మెంట్ నీరు నాగులవంకలో చేరి, అక్కడి నుంచి నార్లపురం వద్ద పెద్ద వాగు ద్వారా హంద్రీలోకి ప్రవహిస్తుందని తెలిపారు. వెల్దుర్తి గ్రామంలో 350 వర్క్స్ గుర్తించడం జరిగిందని, అందులో 154 శాంక్షన్ చేశామని, ఇప్పటికీ 62 గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఇక్కడ ఐదు లక్షల వర్త్ తో లేబర్ కాంపోనెంట్‌తో 120 మంది మనుషులు 3 రోజుల నుంచి వర్క్ చేస్తున్నారన్నారు. వెల్దుర్తి గ్రామంలో 5.2 మీటర్ల లోతులో నీరు ఉందని, దాన్ని 3 మీటర్లకి తీసుకుని రావాలన్నారు. ఇక్కడ పనులు పూర్తై వర్షాలు పడిన తర్వాత వర్షం నీరంతా కూడా ఇక్కడ చేరి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అన్ని మండలాల్లో కలిపి 5500 పనులను గుర్తించడం జరిగిందన్నారు. 5500 పనులలో ఇప్పటికే 3500 పనులకు శాంక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో 1600 నుండి 1700 వరకు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. 40 ఏళ్ల నుండి పులికుంట ట్యాంక్ నిండలేదని చెప్తున్నారని, కాబట్టి ముందు ఆ ట్యాంక్ దగ్గర పనులు చేసి చెరువు నిండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైతే ఉపాధి హామీ శ్రామికులతో పని చేయించలేమో, అక్కడ ఎక్స్‌కవేటర్స్, జెసిబిలు పెట్టించి పనులు చేయిస్తున్నామన్నారు. వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వారు నిర్ధారించారు కాబట్టి, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతి ద్వారా సాగు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఆ పద్ధతి ద్వారా భూమి తాలూకా సారం పెరుగుతుందన్నారు.. ఈ పంటను రైతులు అమ్ముకుంటే ఎండాకాలం పంట లేకపోయినా 30 వేల రూపాయల వరకు మిగులుతుందన్నారు. అదే విధంగా పాడి పశువులను కూడా పెంచుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఎండకి భూమి ఎక్స్పోజ్ అయినప్పుడు 50 డిగ్రీలు టెంపరేచర్ ఉంటుందని, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పంటలో టెంపరేచర్ చూస్తే 30 డిగ్రీలు ఉంటుందన్నారు. ఆడపిల్లలకు చిన్న వయసులో పెళ్లి చేయకుండా తప్పనిసరిగా చదివించాలన్నారు. అమ్మాయిలు చదువుకుని తమ కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించాలన్నారు. వారు మంచి స్థాయికి చేరుకుని కుటుంబాన్ని కూడా బాగా చూసుకుంటారన్నారు. కాబట్టి బాల్య వివాహాలకు దూరంగా ఉండి, ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 'అక్షరాంధ్ర' కార్యక్రమం ఈ సంవత్సరం కూడా చేపడుతున్నామన్నారు. గత అక్షరాంధ్ర కార్యక్రమంలో 60 ఏళ్లు, 65 ఏళ్లు, 70 ఏళ్ళ ఉన్నవారు కూడా వచ్చి రాత్రి బడిలో చదువుకోవడం జరిగిందన్నారు. అక్షరాంధ్ర లో భాగంగా పెట్టిన పరీక్షలో 100% పాస్ అయ్యారన్నారు. ఈ సంవత్సరం కూడా 100 శాతం పాస్ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది 1,85,000 మంది పాస్ అయ్యే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. గత సంవత్సరం 1,60,000 మంది పాస్ అయ్యారన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు. ఎండాకాలం కాబట్టి ఉపాధి హామీ శ్రామికులు ఉదయం 6 గంటలకు పనులకు రావాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డ్వామా పిడి నరసింహ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్, డ్వామా ఏపిడి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ ఈ విత్తనాలను గుప్పెడు మోతాదులో తినాల్సిందే..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను రోజూ తీసుకోవాలన్న విషయం అందరికీ తెలిసిందే. పౌష్టికాహారాలను తింటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. అన్ని పోషకాలు లభించి పోషకాహార లోపం తగ్గుతుంది. అనేక వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చు. అయితే పౌష్టికాహారాల విషయానికి వస్తే పలు రకాల విత్తనాలు వాటిల్లో ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. మనకు తినేందుకు అనేక రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. విత్తనాలను తినడం వల్ల అనేక రకాల విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, కొవ్వులు లభిస్తాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. పైగా శరీరానికి శక్తి కూడా లభిస్తుంది. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మనకు ఎంతో మేలు చేస్తుంది. కనుక విత్తనాలను మనం రోజూ తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

### అవిసె గింజలు, చియా సీడ్స్..

మనకు అందుబాటులో ఉన్న అనేక రకాల విత్తనాల్లో అవిసె గింజలు కూడా ఒకటి. వీటిల్లో ఫైబర్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆకలిని నియంత్రిస్తాయి. దీని వల్ల ఆహారం తక్కువగా తింటారు. ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. రోజూ గుప్పెడు అవిసె గింజలను నీటిలో నానబెట్టి లేదా పెనంపై కాస్త వేయించి సాయంత్రం సమయంలో స్నాక్స్ లా తింటుండాలి. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. అవిసె గింజలను తింటుంటే బీపీని తగ్గించుకోవచ్చు. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అలాగే చియా సీడ్స్ కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల కూడా ఫైబర్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, పాలిఫినాల్స్ లభిస్తాయి. చియా విత్తనాలను తింటుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధులు తగ్గుతాయి. శరీరంలోని వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.

### నువ్వులు, పొద్దు తిరుగుడు విత్తనాలు..

మనకు నువ్వులు కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఫైబర్, మెగ్నిషియం, మాంగనీస్, కాపర్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్‌లు పుష్కలంగా ఉంటాయి. నువ్వులను తింటే క్యాల్షియం సమృద్ధిగా లభించి ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. మహిళల్లో హార్మోన్ల సమస్యలు తగ్గుతాయి. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు నువ్వులను తింటుంటే కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కండరాలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే పొద్దు తిరుగుడు విత్తనాలను కూడా రోజూ తినవచ్చు. రోజూ గుప్పెడు మోతాదులో వీటిని నానబెట్టి లేదా కాస్త వేయించి తినవచ్చు. సాయంత్రం స్నాక్స్ రూపంలో వీటిని తినాలి. ఈ విత్తనాలను తింటుంటే కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. విటమిన్ ఇ అధికంగా లభిస్తుంది. క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటాయి. గర్భిణీలకు మేలు చేస్తాయి.

### గుమ్మడికాయ విత్తనాలు..

రోజూ గుమ్మడికాయ విత్తనాలను తింటున్నా ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో అనేక రకాల మినరల్స్ ఉంటాయి. గుమ్మడికాయ విత్తనాల్లో అధికంగా ఉండే మెగ్నిషియం వల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. చురుగ్గా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. నిద్రలేమి తగ్గుతుంది. ఈ విత్తనాల్లో జింక్ అధికంగా ఉంటుంది కనుక రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. వీటిల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా పలు రకాల విత్తనాలను రోజూ తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. వీటిని అన్నింటినీ కలిపి రోజుకు ఒక గుప్పెడు మోతాదులో కూడా తినవచ్చు. నీటిలో నానబెట్టి తింటే తేలిగ్గా జీర్ణం అవడమే కాదు, పోషకాలను పూర్తి స్థాయిలో పొందవచ్చు. ఇలా ఆయా విత్తనాలతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

## అసలు కీటో డైట్ అంటే ఏమిటి..? దీన్ని ఎలా పాటించాలి..? దీంతో కలిగే లాభాలు ఏమిటి..?



ఆరోగ్యంగా ఉండడం కోసం చాలా మంది అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు వ్యాయామం చేస్తే కొందరు డైట్ పాటిస్తారు. ఇంకొందరు రోజూ పలు ఆహారాలను లేదా పానీయాలను తీసుకుంటుంటారు. కొందరు డైటిషియన్ లేదా న్యూట్రిషియన్ సలహా మేరకు జీవనశైలిని మార్చుకుంటారు. అయితే ఇవన్నీ ఉపయోగకరమైనవే. అయినప్పటికీ ఆరోగ్యంగా ఉండేందుకు డైట్ చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. సరైన డైట్‌ను పాటిస్తేనే మనకు పోషకాలు సరిగ్గా లభిస్తాయి. దీంతో ఆరోగ్యంగా ఉంటారు. రోగాల నుంచి బయట పడవచ్చు. అయితే చాలా మంది కీటో డైట్ గురించి వినే ఉంటారు. కానీ అసలు కీటో డైట్ అంటే ఏమిటి.. దీన్ని ఎలా పాటించాలి..? దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..? అన్న విషయాలపై చాలా మందికి సరైన అవగాహన లేదు. ఈ క్రమంలోనే వైద్యులు, పోషకాహార నిపుణులు కీటో డైట్ గురించి పలు విషయాలను తెలియజేస్తున్నారు. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### కీటోజెనిక్ డైట్ అంటే..

మన శరీరం పనిచేసేందుకు గ్లూకోజ్ అవసరం అవుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. గ్లూకోజ్ మన శరీరానికి ప్రధాన శక్తి వనరు. అయితే గ్లూకోజ్ తగినంతగా లేకపోతే మన శరీరం కొవ్వును ఇంధనంగా వాడుకుంటుంది. కానీ ఈ సమయంలో విపరీతంగా ఆకలి అవుతుంది. దీంతో మనం ఆహారం తీసుకుంటాం. తద్వారా అందులో ఉండే పిండి పదార్థాలు గ్లూకోజ్‌గా మారుతాయి. తిరిగి యథావిధిగా మన శరీరానికి గ్లూకోజ్ లభిస్తుంది. అయితే శరీరం కేవలం కొవ్వును మాత్రమే ఇంధనంగా వాడుకునేలా చేసే ప్రక్రియనే కీటోజెనిక్ డైట్ అంటారు. ఈ డైట్‌లో భాగంగా మనం తినే ఆహారాల వల్ల శరీరంలో గ్లూకోజ్ స్థాయిలు పెరగకూడదు. కానీ మనం ఆహారం తినాల్సి ఉంటుంది. వాటి వల్ల గ్లూకోజ్ పెరగకుండా చూడాలి. దీంతో శరీరం కొవ్వును ఇంధనంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల శరీరంలోని కొవ్వు నిల్వలు ఖర్చవుతాయి. ఇది మనకు మేలు చేస్తుంది. ఇది కీటో డైట్‌లో ముఖ్య భాగం అని చెప్పవచ్చు. ఇలా కీటోడైట్‌ను పాటించాల్సి ఉంటుంది.

### వీటిని తినాలి..

అయితే కీటోడైట్‌ను పాటించాలంటే మన శరీరానికి గ్లూకోజ్ లభించకూడదు. కనుక కొవ్వులు లేదా ప్రోటీన్లు ఉండే ఆహారాలనే తినాల్సి ఉంటుంది. అప్పుడే కీటోడైట్ పాటించినట్లు అవుతుంది. కీటోడైట్‌లో భాగంగా బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, పల్లీలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, గుమ్మడికాయ విత్తనాలు, అవిసె గింజలు, మాంసాహారం, కోడిగుడ్లు తినాలి. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. వేపుళ్లు, చిరుతిండి, ఇతర నూనె పదార్థాలు, జంక్ ఫుడ్స్ కీటోడైట్ కిందకు రావు. కీటోడైట్‌లో భాగంగా రోజుకు 50 గ్రాముల కన్నా తక్కువ మోతాదులో పిండి పదార్థాలను తీసుకోవాలి. మిగిలిన క్యాలరీలన్నీ మనకు కొవ్వులు లేదా ప్రోటీన్ల ద్వారానే లభించాలి. అప్పుడే కీటోడైట్‌ను పాటించినట్లు అవుతుంది. చికెన్, మటన్, చేపలు, రొయ్యలు, కోడిగుడ్లు, పిండి పదార్థాలు తక్కువగా ఉండే కూరగాయలు, ఆకుకూరలు, కొబ్బరినూనె, వెన్న, నెయ్యి, చీజ్, మీగడ, ఆలివ్ ఆయిల్ వంటివన్నీ కీటోడైట్ కిందకు వస్తాయి.

### జాగ్రత్తలు తప్పనిసరి..

కీటోడైట్‌లో ఉన్నవారు గోధుమలు, మొక్కజొన్న, బియ్యం, తృణ ధాన్యాలను తినకూడదు. తేనె, చక్కెర తీసుకోకూడదు. యాపిల్, అరటి పండ్లను తినకూడదు. ఆలుగడ్డలు, క్యారెట్లను కూడా తినకూడదు. ఇలా కీటోడైట్ లో భాగంగా ఏయే ఆహారాలను తినాలి, వేటిని తినకూడదు అనే వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలి. ఆ తరువాతే ఈ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. లేదంటే డైట్‌ను పాటించి కూడా ప్రయోజనం ఉండదు. ఇక కీటోడైట్‌ను కనీసం 21 రోజుల పాటు అయినా పాటించాలి. దీని వల్ల మంచి ఫలితం ఉంటుంది. కీటోడైట్‌ను పాటిస్తే అధిక బరువు తగ్గుతారు. నడుం చుట్టు కొలత గణనీయంగా తగ్గుతుంది.డయాబెటిస్, థైరాయిడ్ వంటి సమస్యలు తగ్గుతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. క్యాన్సర్, గుండె జబ్బులు రావు. మహిళలకు ఉండే పీసీవోఎస్ అనే సమస్య తగ్గిపోతుంది. అయితే కీటోడైట్ అందరికీ పనిచేయదు. కనుక డాక్టర్ సూచన మేరకు దీన్ని పాటించాల్సి ఉంటుంది. లేదంటే కిడ్నీలపై భారం పడి కిడ్నీలు డ్యామేజ్ అయ్యే అవకాశాలు ఉంటాయి.

## బీసీలతో బంతాట బూమరాంగ్



బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశంలో మొత్తానికి సర్కార్ వారి సరదా తీరింది. మనసులో నిత్యం ఏదైనా తలిస్తే పైనుంచి దేవతలు దాన్నే తథాస్తు అంటారని పెద్దలు అంటూ ఉంటారు. అదేవిధంగా బీసీలపై రేవంత్ సర్కార్ మనసులో ఏం పెట్టుకొని రిజర్వేషన్ల పెంపుపై కసరత్తు చేసిందో, అదే నిజమైంది. వాస్తవానికి 20 నెలలుగా కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో వేస్తున్న కుప్పిగంతులను చూసి చాలామంది బీసీలు క్షేత్రస్థాయిలో ఆశలు పెట్టుకున్నారు. దశాబ్ద కాలంగా తెలంగాణ ఆర్థికవ్యవస్థ పునాదిలో జరిగిన మౌలికమైన మార్పుల వల్ల గ్రామీణ సమాజంలో పలువర్గాల ఆకాంక్షల్లో కూడా గతానికి భిన్నమైన నూతనత్వం వచ్చింది. అందులో భాగంగానే రాజకీయాల్లో క్రియాశీలక భాగస్వామ్యాన్ని, అధికారిక పదవుల్లో వాటాను అందిపుచ్చుకోవాలనే చలనశీలత కూడా ఇతర వర్గాలతో పాటు బీసీ సామాజిక వర్గాల్లోనూ బాగా బలపడింది. రాష్ట్ర సామాజిక వ్యవస్థ ఆలోచనల్లో జడత్వానికి చిల్లులు పడి, యథాతథ స్థితి నుంచి కొంతైనా ముందుకు పాకాలనే పెనుగులాట బలహీనవర్గాలతో పాటు అన్ని సామాజిక వర్గాల్లోనూ స్పష్టంగా కనపడుతున్నది. ఏడు దశాబ్దాల కాలంలో కంటే కొంత భిన్నంగా కదులుతున్న గ్రామీణ తెలంగాణ ధోరణిలో సంభవించిన నూతన దృక్పథం వల్ల పల్లె రాజకీయాల్లోనూ ప్రాతినిధ్య పట్టుదల కోసం అందరూ పరుగులు తీస్తున్నారు. ఈ భావోద్వేగాలతోనే రేవంత్ ప్రభుత్వం చెలగాటమాడి చేతులు కాల్చుకున్నది. విపక్షంలో ఉన్న సందర్భాల్లో అనేక విధాలైన హామీలను రాజకీయ పార్టీలు ఇవ్వడం సహజంగా జరిగేదే. కానీ, రెండేండ్ల కిందట జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ హామీల చుట్టూ ప్రచారాన్నే కాదు గ్యారెంటీనీ ఇంటింటికీ ఇచ్చింది. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ 420 హామీల్లో ఆడుతున్న నాటకాలకు, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీ చుట్టూ చేస్తున్న విన్యాసాలకు మధ్య ఉద్వేగపూరితమైన వ్యత్యాసం ఉన్నది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అంశం 50 శాతం పైగా ప్రజల తాజా భావోద్వేగాలతో పాటు బీసీయేతర సామాజికవర్గాల ఆలోచనలపైన సైతం తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను రేవంత్ సర్కార్ సామాజిక దృష్టికోణంతో పరిష్కార ప్రయత్నంగా ముందుకు తీసుకెళ్లకుండా, అలవాటైన కురచ బుద్ధితో రాజకీయ లబ్ధి కోసమే సాగదీసి వివాదాస్పదం చేసేసింది. దీనివల్ల రిజర్వేషన్ల అమలు సంక్లిష్టంగా మారి సామాజిక సామరస్యానికి సవాల్‌గా మారింది. దేశంలో ఇంతలా సంకుచితంగా, అవివేకంగా, అహంకార ధోరణితో సున్నితమైన రిజర్వేషన్ల అంశంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన దిక్కుమాలిన సర్కార్ మరేదీ ఉండదేమో?

హైకోర్టు స్టే ఇవ్వడానికి ముందురోజు వరకు రాష్ట్ర సర్కారు లేడికి లేచిందే పరుగన్నట్టుగా గ్రామాల్లో, మండల, జిల్లా కేంద్రాల్లో అధికారుల ద్వారా చేసిన హంగామా, స్థానిక సంస్థల ఎన్నికల శంఖారావం పూరిస్తూ ఊరూరా హస్తం పార్టీ నేతలు చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదు. దీంతో నిజంగానే ఎన్నికలు వస్తాయేమోనని నమ్మిన చాలామంది ద్వితీయ శ్రేణి నాయకులు విచిత్రమైన మానసిక భావోద్వేగ స్థితిలోకి వెళ్లిపోయారు. ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానానికి తలపడాలని తపన పడుతున్న నాకు తెలిసిన ఒక నాయకుడికి కోర్టు స్టే ఇస్తుందని చెప్పినా నమ్మకుండా తన భూమి డాక్యుమెంట్లతో అప్పు కోసం ఆసాముల చుట్టూ చక్కర్లు కొట్టాడు. మానవ సమాజ పరిణామక్రమమే అవకాశాల వెతుకులాటలో విస్తరించింది. మనిషి ఆశాజీవి. అంతేకాదు, అవకాశాలకు సుదీర్ఘకాలం దూరంగా మెలిగిన వర్గాలకు అందుబాటులో ఏదైనా ఉందనితోస్తే వేగంగా అందిపుచ్చుకోవడానికి ఆరాటపడటం సహజ మానసికస్థితినే కదా..! కానీ, చివరికి నమ్మిన బీసీలే కాదు, ఎన్నికల కలలు కన్న వర్గాలన్నీ ఉసూరుమన్నాయి. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా గ్రామాల్లో గందరగోళమే తప్ప అన్నివర్గాల ప్రజల ఇష్టపూర్వక భాగస్వామ్యం మాత్రం ఉండకపోవచ్చు. సర్కారే మరుగుజ్జు మానసిక స్థితిలో ఉంటే సకలజనులను ఎలా సమస్యల వలయంలో పడేస్తుందో రేవంత్ ప్రభుత్వం నిరూపించింది. తాజాగా నమ్మిన బలహీన వర్గాల పరిస్థితి తెలంగాణ కవి చెరబండరాజు 'తీసుకున్న ఓట్లన్నీ మావి.. తీరా మా బతుకే ఎండమావి' అని తన కవిత్వంలో అన్నట్టుగా మారింది. అయితే, ఇలా అన్నివర్గాల ఆవేదనకు కారణమెవ్వరంటే కసాయిని నమ్మిన గొర్రెల సామెతే సమాధానంగా స్ఫురిస్తుంది కదా? విపక్షంలో ఉన్నప్పుడే చాలా స్పష్టంగా రాష్ట్రాలకు రిజర్వేషన్లు అడిగిన వారిని ఉరి తీయాలని డిమాండ్ చేసిన రేవంత్ లాంటి పాలకుడు బీసీల రిజర్వేషన్లు పెంచే ప్రయత్నం చిత్తశుద్ధితో చేస్తాడని నమ్మడమూ మూర?త్వమే కదా? అసలు రాష్ట్రంలోనే కాదు, భారతదేశ సామాజిక చరిత్రను యథాతథస్థితిలో ఉంచడానికో లేక వీలైతే వెనక్కి నడిపించడానికో కాంగ్రెస్ పార్టీ తన సర్వశక్తులూ ధారపోస్తుంది కానీ, పురోగతి కోసం ఒక్క చెమట బొట్టు కూడా ఖర్చుచేయదు. అందుకే, నెహ్రూ మంత్రిమండలి నుంచి అంబేద్కర్ బయటకొస్తూ బలహీనులకు సాధికారత ఇవ్వకపోయినా నష్టం లేదు కానీ, వారిని నిత్యం సమస్యల సంకెళ్లతో బంధించి ఉంచాలనే ప్రయత్నమే దారుణమనీ, అదే విధానంగా ఉన్న కాంగ్రెస్ దేశానికి పెద్ద ప్రమాదం అని పూర్తిగా విశ్వసించే రాజీనామా చేస్తున్నానని అన్నారు. అలాంటి కాంగ్రెస్‌ను తమిళనాడు వలె వదిలించుకోవాలే కానీ, తగిలించుకొని తెలంగాణ నిత్యం తన్నించుకుంటుండటమే ఆవేదనాభరితం. ఏదేమైనా బీసీ రిజర్వేషన్ల పెంపు కసరత్తు విధానంలో అధ్వాన్నంగా వ్యవహరించడమే కాకుండా బీఆర్ఎస్‌నూ బద్నాం చేసే ఎత్తులేసిన రేవంత్ సర్కార్ తీరా తానే బొక్కబోర్లా పడ్డది.

వాస్తవానికి 2011లో సేకరించిన జనాభా లెక్కల్లో బీసీల వివరాలు కూడా సేకరించాలని నాడే భారతదేశ సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి పీఎస్ కృష్ణన్ అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరంకు లేఖ రాశారు. ఆరు దశాబ్దాల పాటు ఏమార్చినా, కనీసం 2011 జనాభా లెక్కల్లోనైనా యూపీఏ సర్కార్ పీ ఎస్ కృష్ణన్‌తో పాటు దేశ బీసీ సంఘాల డిమాండ్‌ను ఆలకించి ఉంటే, గడిచిన దశాబ్దన్నరలో అనేక సామాజిక సమస్యలకు రాజ్యాంగబద్ధ పరిష్కారం సాకారమయ్యేది. కానీ, నక్కకు నెమలి నైజం ఎలా ఎప్పటికీ అలవడదో కాంగ్రెస్ పార్టీకి కూడా వాస్తవ ప్రజా డిమాండ్లను అర్థం చేసుకునే గుణం రానేరాదని ఆనాడే తేలిపోయింది. కార్యక్రమ సమగ్రత స్వభావం దెబ్బతింటుందనే సాకుతో బీసీల వివరాల సేకరణకు నిరాకరించారు. ఎస్సీ, ఎస్టీ కాలమ్ ప్రక్కన ఎస్.ఈ.బీసీ కాలమ్ చేర్చినంత మాత్రాన జనాభా లెక్కల సేకరణ సమగ్రత స్వభావం ఎలా దెబ్బతింటుందో చిదంబరమే సెలవివ్వాలి. నెహ్రూ హయాం నుంచి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు శాసించిన యూపీఏ ప్రభుత్వం దాకా ప్రజలు డిమాండ్లన్నింటినీ దారిలో దానయ్యల ఆర్తనాదాలుగా వదిలేసింది కాంగ్రెస్ అధిష్ఠానం. తీరా నిండా మునిగాక కమ్యూనిస్టు పార్టీల చారిత్రక తప్పిదం తీర్మానాల వలెనే అహ్మదాబాద్‌లో ఏప్రిల్ నెలలో జరిగిన ఏఐసీసీ సమావేశంలో రాహుల్‌గాంధీ బీసీల విషయంలో పట్టించుకోవాల్సినంతగా పట్టించుకోకపోవడం పొరపాటే అనడం హాస్యాస్పదం కాదా? పోనీ ఇప్పటికైనా రేవంత్ సర్కార్ కుట్రలను సరిచేసే పెద్దరికాన్నైనా రాహుల్ గాంధీ ప్రదర్శిస్తున్నారా అంటే సమాధానం శూన్యమే. ప్రజా విశ్వాస సముపార్జనకు పాదయాత్రలు, ప్రసంగాలు మాత్రమే సరిపోవని, పార్టీ ప్రవర్తన కూడా విశాల ప్రజావసరాల పునాదితో సరిచేసుకోవాలనే సత్యాన్ని రాహుల్ గాంధీ అర్థం చేసుకోకపోతే మరో పదేండ్లయినా పదవిలోకి రావడం అసాధ్యం. ఈ మాత్రం బీసీలు, సామాజిక న్యాయం అని హస్తం పార్టీ కొత్త సేనాపతి అప్పుడప్పుడు అరవడానికి ఉత్తరాదిలో, దక్షిణాదిలో మరీ ముఖ్యంగా తమిళనాడులో భాగస్వామ్య పక్ష పార్టీలు బయటకెళ్లిపోకుండా ఉండటానికేనని అందరికీ అర్థమైపోతున్నది.

అయితే, ఏడున్నర దశాబ్దాల కాంగ్రెస్ పార్టీ దగాను మళ్లీ తాజాగా రుచి చూపించిన రేవంత్ సర్కార్ బీసీలకు కాంగ్రెస్ చేసిన చారిత్రక గాయాలన్నింటినీ మళ్లీ గెలికేశాడు. అందుకే, ఇప్పుడు వృత్తి కులాలన్నీ ఉడికిపోతున్నాయి. ఇప్పటికే మోసపోయిన వర్గాలన్నీ హస్తం పార్టీ సర్కార్‌ను శాపనార్థాలు పెడుతుండగా, బీసీలు సైతం భ్రమలు తొలగి ఈసడించుకుంటున్నారు. రేవంత్ సర్కార్ రిజర్వేషన్లు ఇవ్వకపోయినా బాధపడేవారు కాదేమో కానీ, బీసీలను నవ్వుల పాలయ్యేలా ఎగతాళి తతంగం నడిపించడాన్నే జీర్ణించుకోలేకపోతున్నారు. అందువల్లే బీసీలతో బంతాట కాంగ్రెస్ సర్కార్‌కు బూమరాంగ్ అయిపోయింది. ఈ రేవంత్ సర్కార్ నడిపిస్తున్న తతంగమంతా అర్థమైన తర్వాత ఇప్పటికైనా బీసీలు మాత్రమే కాదు ఆలోచనపరులందరూ వాస్తవాల వెలుగులో కదలాలి.కాంగ్రెస్, బీజేపీలు దేశంలో ఏ వర్గాన్నీ ఒడ్డుకు చేర్చరనే చారిత్రక సత్యాన్ని అవగాహన చేసుకోవాలి. డీవోపీటీ 2019, జూలై 17న అధికారికంగా వెల్లడించిన 78 మినిస్ట్రీలు, అనుబంధ విభాగాల్లోని ఏ,బీ,సీ,డీ కేటగిరీ కేంద్ర ఉద్యోగుల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలవుతున్న ఓబీసీలు 21.57 శాతం మాత్రమే ఉన్నారు. అదికూడా డీ కేటగిరీ దిగువశ్రేణి ఉద్యోగాల్లోనే అత్యధికమని గణాంకాలు చెప్తున్నాయి. రాజ్యాంగంలో ఉన్న 340 (1), 15(4), 16 (4) ఆర్టికల్స్ అమలునే ఏడున్నర దశాబ్దాల నుంచి ఎండమావిలా చూపించాయి ఏలిన జాతీయ పార్టీలు. ఇక రాష్ట్రాల్లో బీసీల హక్కులు అమలుపరుస్తాయా? ఒకవేళ డీఎంకే, ఆర్జేడీ, బీఆర్ఎస్, ఎస్పీ వంటి ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఆవిర్భవించకపోయి ఉంటే, కాంగ్రెస్, బీజేపీలు ఇంకెంత బరితెగించి దేశంలోని వివిధ వర్గాలను వేధించేవారో కదా? ఇప్పుడు రాష్ట్రంలో రేవంత్ సర్కార్ సృష్టించిన సమస్యలో నుంచే రిజర్వేషన్లకు తెలంగాణ అంతిమ పరిష్కారాన్ని వెతుక్కోవాలి. అది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదే పదే దేశం ముందు బలంగా పెడుతూ వస్తున్న రాష్ట్రాలకు రిజర్వేషన్ల అమలు హక్కుల డిమాండ్‌ను కేంద్రం మెడలు వంచి సాధించుకోవడమే. అప్పుడే, రాజ్యాంగ అంతిమ లక్ష్యమైన సమాఖ్య వ్యవస్థ సాకారమవుతుంది. భౌగోళిక, సామాజిక వైవిధ్యమైన దేశంలో రాష్ట్రాలకు వర్తమాన సవాళ్లను పరిష్కరించుకునే స్వేచ్ఛ లేకపోతే సుదీర్ఘ సామాజిక రుగ్మతలు మొత్తం సమాజాన్ని వేధిస్తూనే ఉంటాయి.

## బాదంపప్పును పొట్టుతో తినాలా..? పొట్టు తీసేసి తినాలా..? ఎలా తింటే మేలు చేస్తుంది..?



ఆరోగ్యంగా ఉండడం కోసం పౌష్టికాహారాలను తినాలన్న విషయం అందరికీ తెలిసిందే. పౌష్టికాహారాలను తింటే శరీరానికి కావల్సిన అన్ని పోషషకాలు లభిస్తాయి. దీంతో అనేక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. అయితే పౌష్టికాహారాల విషయానికి వస్తే వాటిల్లో బాదంపప్పు ముందు వరుసలో నిలుస్తుందని చెప్పవచ్చు. దీన్ని రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతుంటారు. అయితే బాదంపప్పును పొట్టు తీసి తినాలని కొందరు అంటారు. పొట్టుతోనే తినాలని మరికొందరు సూచిస్తారు. మరి ఇందులో నిజం ఎంత ఉంది..? అసలు బాదంపప్పును పొట్టుతో తినాలా, పొట్టు తీసి తినాలా..? నీటిలో నానబెట్టి తింటే ఏం జరుగుతుంది..? వంటి విషయాలకు గాను నిపుణులు సమాధానాలు చెబుతున్నారు. ఇక ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### పొట్టు తీసి తింటే..

బాదంపప్పు పొట్టులో టానిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం శోషించుకోకుండా అడ్డుకుంటాయి. కనుక బాదంపప్పును పొట్టు తీసి తినాల్సి ఉంటుంది. అలాగే బాదంపప్పు పొట్టులో ఫైటిక్ యాసిడ్ ఉంటుంది. ఇది ఐరన్, జింక్, క్యాల్షియం, మెగ్నిషియం వంటి మినరల్స్‌కు అతుక్కుంటుంది. మనం తిన్న ఆహారంలో ఈ పోషకాలు ఉంటే వాటిని శరీరానికి అందకుండా అడ్డుకుంటుంది. కనుక ఈ కారణం వల్ల కూడా బాదంపప్పును పొట్టు తీసేసి తినాల్సి ఉంటుంది. అలాగే బాదంపప్పు పొట్టులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కొందరికి సరిగ్గా జీర్ణం కాదు. జీర్ణ సమస్యలను సృష్టిస్తుంది. గ్యాస్ వచ్చే అవకాశాలు ఉంటాయి. కనుక బాదంపప్పును పొట్టు తీసి తింటే మంచిది. ఆయుర్వేద కూడా బాదంపప్పును పొట్టు తీసే తినాలని చెబుతోంది. బాదంపప్పును నీటిలో నానబెట్టి పొట్టు తీసి తింటే ఇంకా మంచిదని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

### పొట్టుతో తింటే..

అయితే బాదంపప్పు పొట్టులోనూ అనేక పోషకాలు ఉంటాయి. ఈ పొట్టులో ఫైబర్‌తోపాటు పాలిఫినాల్స్, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. పొట్టు తీసేసి తింటే ఈ పోషకాలను కోల్పోవాల్సి వస్తుంది. కనుక బాదంపప్పును పొట్టుతో తినవచ్చు. ఇందులో సందేహించాల్సిన పనిలేదు. బాదంపప్పు పొట్టు వల్ల మనకు ఎలాంటి హాని కలగదు. కానీ అజీర్తి ఉన్నవారు, పోషకాహార లోపం సమస్యలు ఉన్నవారు మాత్రం బాదంపప్పును నీటిలో నానబెట్టి పొట్టు తీసి తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దీని వల్ల సులభంగా జీర్ణం అవడంతోపాటు కావల్సిన పోషకాలు లభిస్తాయి. ఇలా బాదంపప్పును ఎవరి సౌకర్యానికి తగినట్లు వారు తినవచ్చు. ఇక బాదంపప్పును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

### బాదంపప్పుతో కలిగే లాభాలు..

నానబెట్టి పొట్టు తీసిన బాదంపప్పును తింటే తేలిగ్గా జీర్ణమవుతుంది. మన శరీరానికి కావల్సిన ఆరోగ్యకరమైన కొవ్వులు సులభంగా లభిస్తాయి. బాదంపప్పును తినడం వల్ల విటమిన్ ఇ, రైబోఫ్లేవిన్, ఎల్-కార్నిటైన్ అనే పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. మెదడు యాక్టివ్‌గా మారేలా చేస్తాయి. బాదంపప్పులో ఉండే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఫైబర్, మెగ్నిషియం, పొటాషియం మన శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పప్పును తింటుంటే బరువు తగ్గుతారు. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

## రూ.5 లక్షల వరకూ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ రద్దు జీఎస్టీ జీఓఎం సిఫారసు



టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు, సీనియర్ సిటిజన్లకు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియంలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి అధ్యక్షతన జరిగిన జీఎస్టీ మంత్రుల బృందం (జీఓఎం) సమావేశం ప్రతిపాదించింది. ప్రస్తుతం రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా పథకాలపై అందరికీ జీఎస్టీ రద్దు చేయాలని పేర్కొంది. అయితే రూ5. లక్షలు దాటిన ఆరోగ్య బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీ కొనసాగుతుంది. వచ్చేనెలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో హెల్త్ బీమా పాలసీలు, టర్మ్ జీవిత బీమా పాలసీల ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీ తగ్గింపు, మినహాయింపు విషయమై తుది నిర్ణయం తీసుకోనున్నది. ఇక కొన్ని వస్తువులపై జీఎస్టీ వసూళ్లను క్రమబద్ధీకరించాలని ప్రతిపాదించింది. తాగునీరు, సైకిళ్లు, ఎక్సర్‌సైజ్ నోట్ బుక్‌లు, లగ్జరీ రిస్ట్ వాచీలు, బూట్లపై తగ్గించాలని సూచించింది. 20 లీటర్ల ప్యాకేజ్డ్ డ్రింక్ వాటర్ మీద జీఎస్టీ 18 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని జీఓఎం కోరింది. జీఎస్టీ జీఓఎం సిఫారసులను జీఎస్టీ కౌన్సిల్ ఆమోదిస్తే సైకిళ్లపై 12 నుంచి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గి రూ.10 వేల లోపు ధరకు దిగి వస్తాయి. ఎక్సర్‌సైజ్ నోట్ బుక్‌లపై జీఎస్టీ 12 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని జీఓఎం ప్రతిపాదించింది. ఇక రూ.25 వేల పై చిలుకు ధర గల లగ్జరీ రిస్ట్ వాచీలపై జీఎస్టీ 18 నుంచి 28 శాతానికి పెంచాలని సూచించింది. రూ.15 వేల పై చిలుకు విలాసవంతమైన బూట్లపై జీఎస్టీని 18 నుంచి 28 శాతానికి పెంచాలని పేర్కొంది.

## మధ్యతరగతి ఇండ్ల కొనుగోలు దారులకు ఐదు శాతంపై రూ.25 లక్షల రుణ పరపతి కల్పించాలి.. నారెడ్కో



ప్రతి ఒక్కరికి సొంతింటి కల ఉంటుంది. దాని సాకారం కోసం సుదీర్ఘ కాలం ప్రణాళికతో ముందుకు సాగుతుంటారు. ప్రస్తుతం ఇండ్ల ధరలు ఆకాశాన్నంటే రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో మధ్యతరగతి వర్గ ప్రజలకు వెసులుబాటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) అధ్యక్షుడు జీ హరిబాబు కోరారు. ఐదు శాతం వడ్డీరేటుపై రూ.25 లక్షల వరకూ మధ్యతరగతి వర్గ ప్రజలకు ఇండ్ల కొనుగోలుకు రుణం ఇవ్వాలని కోరారు. మొత్తం దేశ జనాభాలో 30 శాతం మంది మధ్యతరగతి వర్గ ప్రజలు. వారంతా అద్దె ఇండ్లలోనే నివసిస్తుంటారు. ప్రస్తుతం ఇండ్ల రుణాలపై బ్యాంకులు 8.75 నుంచి 9 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. దీనివల్ల ఈఎంఐలు భారీగా ఉంటున్నాయి. ఈ పరిస్థితి నుంచి మధ్య తరగతి వర్గ ప్రజలను రక్షించడానికి రూ.25 లక్షల రుణ పరపతి కల్పించాలని హరిబాబు కేంద్రాన్ని కోరారు. '30 శాతం మంది మధ్యతరగతి వర్గ ప్రజల్లో మెజారిటీ రూ.50 వేల నుంచి రూ.70 వేల మధ్య వేతనం అందుకుంటున్నారు. వీరు ఈఎంఐల రూపంలో నెలకు రూ.15,000-20,000 చెల్లించగలరు. రూ.20 వేల ఈఎంఐ ప్రాతిపదికన ఇంటి కొనుగోలుకు రూ.20 లక్షల రుణం మాత్రమే లభిస్తుంది. ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ఇండ్ల నిర్మాణ ప్రాజెక్టులు చేపడుతున్న రియాల్టీ సంస్థలు రూ.20 లక్షల్లోపు ధరకు మధ్య తరగతి వర్గ ప్రజలకు ఇండ్లు సమకూర్చ గలవా?. రూ. లక్ష లోపు వేతనం తీసుకుంటున్న వారికి ఈ అవకాశమే లేదు' అని హరిబాబు పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇండ్ల అద్దెలు భారీగా పెరిగిపోయాయి. 2019 నుంచి దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇండ్ల ధరలు 45 శాతం పెరిగితే, ఇండ్ల అద్దెలు 64 శాతం పెరిగాయి. 'ఐదు శాతం ఫిక్స్డ్ వడ్డీరేటుపై తొలి ఐదేండ్లలో రూ.20 లక్షల ఇంటి రుణం కల్పిస్తే ఈఎంఐ రూ.16 వేల నుంచి రూ.17 వేలకు దిగి వస్తుంది. వన్ బెడ్ రూమ్, ఒక హాలు, కిచెన్ గల ఇల్లు కొనుగోలు చేయడానికి వారు మరో రూ.10-15 లక్షలు రెగ్యులర్ వడ్డీరేటుపై రుణం పొందే అవకాశం ఉంటుంది' అని హరిబాబు తెలిపారు. లగ్జరీ, ఆల్ట్రా లగ్జరీ ఇండ్ల కోసం మొత్తం పది శాతం జనాభా నుంచి మాత్రమే డిమాండ్ ఉంది. మిగతా 60 శాతం మంది జనాభా ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలే. వారికి ఉచిత ఇండ్ల పథకాల ద్వారా సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చునని హరిబాబు అన్నారు.

## ఐటీఆర్ ఫైలింగ్‌లో కొత్త రికార్డు 7.28 కోట్లు దాటిన ఐటీఆర్స్




గత ఆర్థిక సంవత్సరం ( 2023-24) ఐటీ రిటర్న్సులో సరికొత్త రికార్డు నమోదైంది. 2022-23 ఐటీ రిటర్న్సుతో పోలిస్తే 7.5 శాతం వృద్ధితో 7.28 కోట్ల పై చిలుకు ఐటీఆర్‌లు నమోదయ్యాయని ఆదాయం పన్ను విభాగం శుక్రవారం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఐటీఆర్ దాఖలు చేయడానికి జూలై 31తో గడువు ముగిసింది. 2024-25 అంచనా సంవత్సర ఐటీ రిటర్న్సు జూలై 31 నాటికి 7.28 కోట్లకు పైగా ఫైల్ అయ్యాయి. 2023-24 అంచనా సంవత్సర ఐటీ రిటర్న్సు 6.77 కోట్ల ఫైలింగ్స్ తో పోలిస్తే 7.5 శాతం ఎక్కువ అని ఓ ప్రకటనలో తెలిపింది. '2024-25 అంచనా సంవత్సరంలో మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్ ఫైలింగ్స్‌లో కొత్త ఆదాయం పన్ను విధానం కింద 5.27 కోట్ల ఐటీఆర్‌లు ఫైల్ కాగా, పాత ఆదాయం పన్ను విధానం కింద 2.01 కోట్ల ఐటీఆర్‌లు ఫైల్ అయ్యాయి' అని వివరించింది. దీంతో పన్ను చెల్లింపుదారుల్లో సుమారు 72 శాతం మంది కొత్త ఆదాయం పన్ను విధానాన్ని ఎంచుకుంటే, 28 శాతం మంది పాత ఆదాయం పన్ను విధానంలో ఐటీఆర్ ఫైల్ చేశారు. 2024-25 అంచనా సంవత్సరంలో అడిటింగ్ అవసరం లేని వేతన జీవులు ఐటీఆర్ ఫైల్ చేయడానికి 2024 జూలై 31 తుది గడువు. ఒక్క రోజే అత్యధికంగా 69.92 లక్షల ఐటీఆర్‌లు ఫైల్ అయ్యాయి. తొలిసారి ఐటీఆర్ ఫైల్ చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నారు. ఆదాయం పన్ను పరిధి విస్తృతం అవుతుందని చెప్పడానికి ఇది సంకేతం అని ఆదాయం పన్ను విభాగం వివరించింది. ఐటీఆర్ ఫైల్ చేయడం కోసం ఆదాయం పన్ను విభాగం ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన.. అంటే ఆర్థిక సంవత్సరం తొలి రోజే 'ఈ-ఫైలింగ్ పోర్టల్'లో ఐటీఆర్ ఫామ్స్ (ఐటీఆర్-1, ఐటీఆర్-2, ఐటీఆర్-4, ఐటీఆర్-6) అందుబాటులోకి తెచ్చింది. ఇలా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాడే ఐటీఆర్ ఫామ్స్ అందుబాటులోకి తేవడం చారిత్రాత్మకంగా నిలిచింది. మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్‌ల్లో ఐటీఆర్ -1 ఫామ్ కింద 45.77 శాతం అంటే 3.34 కోట్లు, ఐటీఆర్-2 ఫామ్ కింద 1.09 కోట్ల మంది (14.93 శాతం), ఐటీఆర్-3 ఫామ్ కింద 91.10 లక్షల మంది (12.5 శాతం0, ఐటీఆర్ -4 ఫామ్ కింద 1.88 కోట్ల మంది (25.77 శాతం), ఐటీఆర్ -5 నుంచి ఐటీఆర్ -7 ఫామ్స్ వరకూ 7.48 లక్షల మంది (1.03 శాతం) ఐటీఆర్ ఫైల్ చేశారు. 43.82 శాతం మంది 'ఈ-ఫైలింగ్ పోర్టల్'లో ఆన్ లైన్ ఐటీఆర్ యుటిలిటీ సేవలను వినియోగించుకుని ఐటీఆర్ ఫైల్ చేస్తే, మిగతా వారు ఆఫ్ లైన్ చానళ్ల ద్వారా దాఖలు చేశారు. మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్‌ల్లో 6.21 కోట్ల పై చిలుకు ఐటీఆర్‌ల ఈ-వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. వాటిలో ఆధార్ ఆధారిత ఓటీపీ ద్వారా 5.81 కోట్ల పై చిలుకు (93.56 శాతం) మంది ఈ-వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. జూలై 31 వరకూ వేతన జీవులు, ఐటీ ఫైల్ చేస్తున్న వారి నుంచి వచ్చిన సుమారు 10.64 లక్షల సందేహాలను ఈ-ఫైలింగ్ హెల్ప్ డెస్క్ నివృత్తి చేసింది.

# ఒక్క గంటలో రూ.12,295 కోట్లు రాబట్టి రికార్డ్ సృష్టించిన గౌతమ్ అదానీ!



దీపావళి ముహూర్తపు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ గౌతమ్ అదానీకి చాలా లాభదాయకంగా ఉంది. అదానీ గ్రూప్‌నకు చెందిన 10 కంపెనీల్లో 9 కంపెనీల షేర్లలో పెరుగుదల కనిపించింది. ఇందులో అదానీ గ్రీన్ ఎనర్జి మార్కెట్ క్యాప్ అత్యధికంగా పెరిగింది. 9 కంపెనీల మార్కెట్ క్యాప్ గురించి చూస్తే.. మొత్తం రూ.12,295 కోట్ల పెరుగుదల కనిపించింది. అదే సమయంలో అదానీ విల్మార్ మార్కెట్ క్యాప్ నష్టాలను చవిచూసింది. గౌతమ్ అదానీ గ్రూప్‌కి చెందిన ఏ కంపెనీ ఎంత లాభపడిందో, ఎవరు ఎంత నష్టపోయారో తెలుసుకుందాం.

**1.** అదానీ ఎంటర్‌ప్రైజెస్ మార్కెట్ క్యాప్ రూ.201.99 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.3,40,096.66 కోట్ల నుంచి రూ.3,40,298.65 కోట్లకు పెరిగింది.

**2.** అదానీ పోర్ట్, సెజ్ మార్కెట్ క్యాప్ రూ.3,747.85 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,97,386.32 కోట్ల నుంచి రూ.3,01,134.17 కోట్లకు పెరిగింది.

**3.** అదానీ పవర్ మార్కెట్ క్యాప్ రూ.1,581.35 కోట్లు లాభపడగా, కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,28,658.62 కోట్ల నుంచి రూ.2,30,239.97 కోట్లకు పెరిగింది.

**4.** అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మార్కెట్ క్యాప్ రూ.102.11 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,17,209.15 కోట్ల నుంచి రూ.1,17,311.26 కోట్లకు పెరిగింది.

**5.** అదానీ గ్రీన్ ఎనర్జి మార్కెట్ క్యాప్ రూ.5,369.88 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,53,128.38 కోట్ల నుంచి రూ.2,58,498.26 కోట్లకు పెరిగింది.

**6.** అదానీ టోటల్ గ్యాస్ మార్కెట్ క్యాప్ రూ.505.92 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.79,032.35 కోట్ల నుంచి రూ.79,538.27 కోట్లకు పెరిగింది.

**7.** అదానీ గ్రూప్: ఒకే ఒక్క కంపెనీ అదానీ విల్మార్ మార్కెట్ క్యాప్‌లో క్షీణతను చవిచూసింది. ఈ కంపెనీ రూ.279.43 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఆ తర్వాత కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.44,981.88 కోట్ల నుంచి రూ.44,702.45 కోట్లకు తగ్గింది.

**8.** అదానీ గ్రూపునకు చెందిన సిమెంట్ కంపెనీ ఏసీసీ లిమిటెడ్ మార్కెట్ క్యాప్ రూ.156.81 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.43,562.88 కోట్ల నుంచి రూ.43,719.69 కోట్లకు పెరిగింది.

**9.** అదానీ గ్రూపునకు చెందిన సిమెంట్ కంపెనీ అంబుజా సిమెంట్స్ మార్కెట్ క్యాప్ రూ.615.79 కోట్లు లాభపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,42,959.68 కోట్ల నుంచి రూ.1,43,575.47 కోట్లకు పెరిగింది.

**10.** అదానీ గ్రూప్ మీడియా సంస్థ ఎన్డీటీవీ మార్కెట్ క్యాప్ రూ.12.9 కోట్లు లాభపడింది. ఆ తర్వాత కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,084.40 కోట్ల నుంచి రూ.1,097.30 కోట్లకు పెరిగింది.

**11.** అదానీ గ్రూప్‌కు చెందిన 10 కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.12,294.6 కోట్లు పెరిగింది. ఒక కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.279 కోట్లకు పైగా నష్టాన్ని చవిచూసింది.

# ఇప్పుడు క్రెడిట్ కార్డ్ పొందడం అంత సులభం కాదు బ్యాంకులు కీలక నిర్ణయం



గత కొన్నేళ్ల నుంచి క్రెడిట్ కార్డుల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. బ్యాంకులు కూడా అధిక మొత్తంలో క్రెడిట్ కార్డులను జారీ చేశాయి. కానీ ఇప్పుడు క్రెడిట్ కార్డుల వల్ల సమస్య ఏర్పడటంతో కార్డుల జారీ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. చాలా మంది క్రెడిట్ కార్డులు డిఫాల్ట్‌గా మారుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) నుండి ఇటీవలి డేటా ప్రకారం, సెప్టెంబర్‌లో కొత్త క్రెడిట్ కార్డ్‌లను జోడించే వేగం గణనీయంగా తగ్గింది. ఇది ఆగస్టులో 9.2 లక్షల కొత్త కార్డుల నుండి సెప్టెంబర్‌లో 6.2 లక్షలకు పడిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 64% భారీ క్షీణతను సూచిస్తుంది. మొత్తం క్రెడిట్ కార్డ్‌ల సంఖ్య 106 మిలియన్లకు చేరుకుంది. చాలా మంది క్రెడిట్ కార్డులు డిఫాల్ట్‌గా మారుతుండటంతో ఇక నుంచి కార్డులు జారీ చేసే విషయంలో బ్యాంకులు జాగ్రత్త పడుతున్నాయి. ఆర్బీఐ ఆదేశాల ప్రకారం కార్డుల జారీ విషయంలో వెనుకడుగు వేస్తున్నాయి. పెరుగుతున్న నష్టాల కారణంగా కొత్త కస్టమర్లను చేర్చుకోవడంలో బ్యాంకులు ఇప్పుడు మరింత జాగ్రత్తగా మారాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్త కార్డుల జారీలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎస్‌బిఐ కార్డ్‌లు ముందున్నాయని, అయితే సమీప భవిష్యత్తులో క్రెడిట్ కార్డ్ పంపిణీ వేగం మందగించే అవకాశం ఉందని ఐడిబిఐ క్యాపిటల్ అనలిస్ట్ బంటీ చావ్లా చెప్పారు.

### నివేదిక ఏం చెబుతోంది?

ఆర్బీఐ ఇటీవల రిస్క్ ప్రమాణాలను మార్చింది. క్రెడిట్ కార్డులు డిఫాల్ట్‌గా మారుతుండటంతో వ్యక్తిగత రుణాలకు, ఇతర రుణాలపై ప్రభావం పడుతోంది. క్రెడిట్ కార్డ్, ఇతర రక్షణ లేని రుణ విభాగాలలో పెరుగుతున్న నష్టాలను నియంత్రించడం దీని లక్ష్యం. సెప్టెంబర్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 4.3 లక్షల కొత్త కార్డులను జారీ చేయగా, ఎస్‌బిఐ కార్డ్ 1.4 లక్షలు, యాక్సిస్ బ్యాంక్ 53,000 కార్డులను జారీ చేశాయి.

### ఎవరి కార్డులు డిఫాల్ట్‌గా మారుతున్నాయి?

నివేదిక ప్రకారం, బ్యాంకుల క్రెడిట్ కార్డ్ పోర్ట్‌ఫోలియోలో డిఫాల్ట్ రేట్లు ఇప్పుడు 6%కి దగ్గరగా ఉన్నాయి. ఇది బ్యాంకింగ్ రంగానికి ఆందోళన కలిగించే విషయం. మధ్య ఆదాయ సమూహంలో క్రెడిట్ కార్డ్ డిఫాల్ట్ రేటు ఎక్కువగా ఉందని ఆర్థిక సేవల పరిశోధన విభాగం అధిపతి సురేష్ గణపతి నివేదికలో తెలిపారు. ఆర్‌బిఐ వ్యక్తిగత రుణాల పరిధిని ఎత్తివేసిన తర్వాత మధ్యతరగతి వారికి బకాయిలు చెల్లించడానికి పరిమిత ఎంపికలు మిగిలిపోయాయని, ఇది పట్టణ ప్రాంతాల్లో మాంద్యం ఏర్పడిందని గణపతి చెప్పారు.

**పండుగల సమయంలో వినియోగదారుల ఖర్చు పెరిగింది:** ఆగస్టులో 1.6% ఉన్న లావాదేవీల వృద్ధి రేటు సెప్టెంబర్‌లో 0.5%కి తగ్గిందని ఆర్‌బిఐ డేటా చూపుతోంది. అయితే, పండుగ సీజన్‌లో వినియోగదారుల వ్యయం పెరిగింది. ఫలితంగా మొత్తం క్రెడిట్ కార్డ్ ఖర్చు ఆగస్టులో రూ. 1.69 లక్షల కోట్ల నుండి సెప్టెంబర్‌లో రూ. 1.77 లక్షల కోట్లకు పెరిగింది. ఇది ఏడాది ప్రాతిపదికన 23.8% పెరుగుదల.

### డిఫాల్ట్ ఎందుకు పెరుగుతోంది?


యువత తరచుగా వారి మొత్తం క్రెడిట్ పరిమితిని ఉపయోగించుకుంటాయి. ఫలితంగా డిఫాల్ట్‌లు పెరుగుతాయని, అనేక ఖాతాలు నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ గా మారుతాయని నిపుణులు అంటున్నారు. అన్‌సెక్యూర్డ్ కన్స్యూమర్ లోన్‌లు ఇచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలను ఆర్‌బిఐ ఇటీవల ఆదేశించింది.

# జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్? తో మీ కార్ సేఫ్.. అసలు ఇది ఎందుకు.?







జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తి మొత్తం కవర్ అవుతుంది. ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ తో పోలిస్తే జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ కాస్త భిన్నంగా ఉంటుంది.

**1 / 5**


జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటో తెలుసుకుందాం. కంప్రహేన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ లో ఇన్సూరెన్స్ కంపెనీలు వాహనం ప్రస్తుత విలువ అంచనా వేసి క్లెయిం మొత్తాన్ని ఇస్తాయి. జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటో తెలుసుకుందాం. కంప్రహేన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ లో ఇన్సూరెన్స్ కంపెనీలు వాహనం ప్రస్తుత విలువ అంచనా వేసి క్లెయిం మొత్తాన్ని ఇస్తాయి.

కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ తో పోలిస్తే జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ కాస్త భిన్నంగా ఉంటుంది. జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటో తెలుసుకుందాం. కంప్రహేన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ లో ఇన్సూరెన్స్ కంపెనీలు వాహనం ప్రస్తుత విలువ అంచనా వేసి క్లెయిం మొత్తాన్ని ఇస్తాయి. అంటే తరుగుదలను తీసివేసి విలువ కడతాయి. ఈ విధానంలో క్లెయిమ్ 75% మాత్రమె వస్తుంది. జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తి మొత్తం కవర్ అవుతుంది. ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ కవర్ తో పోలిస్తే జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ కాస్త భిన్నంగా ఉంటుంది.

**2 / 5**

అంటే తరుగుదలను తీసివేసి విలువ కడతాయి. ఈ విధానంలో క్లెయిమ్ 75% మాత్రమె వస్తుంది. అదే జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తి మొత్తం కవర్ అవుతుంది. అంటే తరుగుదలను తీసివేసి విలువ కడతాయి. ఈ విధానంలో క్లెయిమ్ 75% మాత్రమె వస్తుంది. అదే జీరో డిప్రిసియేషన్ పాలసీలో నష్టానికి సంబంధించి పూర్తి మొత్తం కవర్ అవుతుంది.

**3 / 5**



ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. అయితే, దీనికి ప్రీమియం ఎక్కువ ఉంటుంది. సాధారణ కవర్ కంటే 20-25% ఎక్కువ ఉంటుంది. హై-ఎండ్, మిడ్-సిగ్మేంట్ కార్లకు ఈ పాలసీ మంచిది. ఎటువంటి తరుగుదల తీసివేయరు. పూర్తి క్లెయిమ్ పొందవచ్చు. అయితే, దీనికి ప్రీమియం ఎక్కువ ఉంటుంది. సాధారణ కవర్ కంటే 20-25% ఎక్కువ ఉంటుంది. హై-ఎండ్, మిడ్-సిగ్మేంట్ కార్లకు ఈ పాలసీ మంచిది.

**4 / 5**

అలాగే చాలామంది ఈ రెండూ కాకుండా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తీసుకుంటారుఇది పేరుకే తప్పు.. ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వదువీలైనంత వరకూ జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ లేదా కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మంచిది. అలాగే చాలామంది ఈ రెండూ కాకుండా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తీసుకుంటారుఇది పేరుకే తప్పు.. ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వదువీలైనంత వరకూ జీరో డిప్రిసియేషన్ కార్ ఇన్సూరెన్స్ లేదా కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మంచిది.

# వార్ 2' లో తారక్ తెర మీదకొచ్చేదప్పుడే!




'వార్ 2' భారీ అంచనాల మధ్య రిలీజ్ కి రెడీ అవుతోంది. ఆగస్టు 14న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. వార్ 2 భారీ అంచనాల మధ్య రిలీజ్ కి రెడీ అవుతోంది. ఆగస్టు 14న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. దీంతో హృతిక్ రోషన్ -తారక్ పాత్రలు ఎలా ఉంటాయి? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇందులో హీరో హృతిక్ రోషన్ కాబట్టి ఆ పాత్ర పరంగా చూసే పనిలేదు. తారక్ ప్రతి నాయకుడు పాత్ర కావ దంతో? అతడి పాత్ర ఎలా ఉంటుంది? అన్న దానిపై తెలుగు ఆడియన్స్ లో ఒకటే ఉత్కంఠ మొదలైంది. పాత్రలో ఏమాత్రం తేడా జరిగినా థియేటర్లు బద్దలైపోవడం ఖాయమే. ఆర్ ఆర్ ఆర్ సినిమా విషయంలో ఏం జరిగిందో తెలిసిందే. రామ్ చరణ్ పాత్రకు ధీటుగా తారక్ రోల్ లేక పోవడంతో అభిమానులు థియేటర్ల తలుపులు బద్దలు కొట్టడం..తెరను చించేయడం వంటి సన్నివేశాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వార్ 2 లో తారక్ రోల్ పై ఆసక్తి నెలకొంది. అయితే తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం హీరోలిద్దరి మధ్య దెబ్బలాట మామూలుగా ఉండదంటున్నారు. తారక్ విలన్ పాత్ర పోషించినా? సినిమా ప్రారంభమైన పావు గంటకే ఆ పాత్ర ప్రత్యక్షమవుతుందని నిర్మాత నాగవంశీ అంటున్నాడు.తారక్ రోల్ పరిచయమైన దగ్గర నుంచి ముగింపు వరకూ ఒకే టెంపోలో ఆ రోల్ సాగుతుందిట. హీరో హృతిక్ రోషన్ పాత్రకు ఏమాత్రం తగ్గకుండా ఆరోల్ ఉంటుందని..పేరుకే విలన్ తప్ప తారక్ రోల్ చాలా ఎగ్జైటింగ్ గా ఉంటుందంటున్నారు. ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ఓ ఎత్తైతే..ఇద్దరు కలిసి డాన్సు చేయడం అన్నది సినిమాకు మరో ఎత్తులా నిలుస్తుందని ధీమా వ్యక్తమవుతోంది. మొత్తానికి ఈ ప్రచారంతో తారక్ రోల్ పై హైప్ రెట్టింపు అవుతుంది. అభిమానుల్ని ఏమాత్రం నిరుత్సాహ పరచకుండానే తారక్ రోల్ ని డిజైన్ చేసి వదులుతున్నట్లు కని పిస్తుంది. మరి ఆ సంగతేంటో తేలాలంటే వచ్చే నెల 14 వరకూ వెయిట్ చేయాలి. ప్రస్తుతం తారక్ తెలు గులో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ చిత్రంలోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే.

# వోడ్కా బాటిల్‌తో రకుల్ లవ్ షురూ!



'కెరటం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన రకుల్ ప్రీత్ సింగ్ లక్కీగా 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో విజయాన్ని సొంతం చేసుకుంది. 'కెరటం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన రకుల్ ప్రీత్ సింగ్ లక్కీగా 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా తర్వాత రకుల్ ప్రీత్ సింగ్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. తక్కువ సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ సినిమాలు చేసింది. తెలుగులో ఒకానొక సమయంలో మహేష్ బాబు వంటి స్టార్ హీరో సినిమాకు డేట్లు ఇవ్వలేక పోయింది. మహేష్ బాబుతో ఈమె బ్రహ్మోత్సవం సినిమాలు చేయాల్సి ఉండగా డేట్లు లేకపోవడంతో ఆ సినిమా నుంచి తప్పుకుందని టాక్. మహేష్ బాబుతో ఆ తర్వాత స్పైడర్ సినిమాను చేసిన విషయం తెల్సిందే. ఇలా ఎంతో మంది టాలీవుడ్ స్టార్ హీరోలతో సినిమాలు చేసింది. టాలీవుడ్‌లో దాదాపు ఐదేళ్ల పాటు బిజీ బిజీగా గడిపిన రకుల్ ప్రీత్ సింగ్ మెల్ల మెల్లగా ప్రాభవం కోల్పోతూ వచ్చింది. ఒకసారి నటించిన హీరోలు మరోసారి ఈమెతో నటించేందుకు ఆసక్తి చూపించక పోవడంతో టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గాయి. ఆ సమయంలో లక్కీగా బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేసింది. అయితే అక్కడ కూడా ఆశించిన స్థాయిలో విజయాలను సొంతం చేసుకోలేక పోయింది. రెండేళ్ల పాటు బాలీవుడ్‌లో సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్ అక్కడ కూడా ఆఫర్లు లేకపోవడంతో ప్రస్తుతం అవకాశాల కోసం వెతుక్కుంటోంది. తాజాగా ఈమె ఫరాఖాన్ షో లో పాల్గొంది. ఆ సమయంలో జాకీ భగ్నానీతో ప్రేమ గురించి చెప్పుకొచ్చింది. గత సంవత్సరం జాకీ భగ్నానీతో రకుల్ ప్రీత్ సింగ్ పెళ్లి జరిగింది. వీరిద్దరి మధ్య పరిచయం ఎప్పుడు ఏర్పడింది, వీరి ప్రేమ ఎప్పటి నుంచి సాగుతుంది అంటూ చాలా మందిలో ప్రశ్నలు ఉన్నాయి. వాటన్నింటికి ఫరాఖాన్ కుకింగ్ వ్లాగ్ సందర్భంగా రకుల్ ప్రీత్ సింగ్ చెప్పుకొచ్చింది. రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ... కోవిడ్ 19 లాక్డౌన్ సమయంలో మొదటి సారి జాకీని కలిసినట్లు ఆమె చెప్పుకొచ్చింది. ఆ రోజు తన సోదరుడి పుట్టిన రోజు కావడంతో పార్టీ కోసం కజిన్స్ అంతా వోడ్కా బాటిల్ కోసం వెతికాం. ఆ సమయంలో అందరం కరోనా కారణంగా పీపీఈ కిట్లను ధరించి ఉన్నాం. అప్పుడే జాకీ ఇంటికి చేరుకున్నాం.

# టైట్ డ్రెస్‌లో అందాల అనన



బాలీవుడ్ నటుడు చుంకీ పాండే నట వారసురాలిగా 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' సినిమాతో హిందీ సినిమా పరిశ్రమలో అడుగు పెట్టింది అనన్య పాండే. తండ్రి వారసత్వంతో ఇండస్ట్రీలో అడుగు పెట్టడంతో వరుసగా ఆఫర్లు దక్కాయి. కెరీర్ ఆరంభంలో హిట్, ఫ్లాప్‌తో సంబంధం లేకుండా అనన్య పాండే ఆఫర్లు దక్కించుకుంది. అయితే ఇండస్ట్రీలో ఈమె అడుగు పెట్టిన సమయంలోనే కరోనా కారణంగా రెండు ఏళ్ల పాటు కాస్త తక్కువ సినిమాలు చేయాల్సి వచ్చింది. కరోనా తర్వాత ఈమె బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోంది. తెలుగులో ఈమె చేసిన లైగర్ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. దాంతో టాలీవుడ్ వైపు ఈమె తిరిగి చూడాలి అనుకోలేదు.ప్రస్తుతం బాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న ఈమె సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆకట్టుకునే అందంతో పాటు, రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఎప్పుడు ఏం చేసినా కూడా వాటిని ఫోటోలు తీసి ఇన్‌స్టాలో షేర్ చేసి అనన్య పాండే తాజాగా వర్కౌట్ డ్రెస్ ను ధరించి ఆ ఫోటోలను షేర్ చేసింది. అంతే కాకుండా స్విమ్ సూట్‌ను ధించిన సమయంలోనూ ఈమె సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేయడం చూస్తూ ఉన్నాం. తాజాగా ఈ టైట్ డ్రెస్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అనన్య పాండే చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు.ఈ ఫోటోల్లో అనన్య పాండే ఇంతకు ముందు కంటే చాలా అందంగా కనిపిస్తుందని నెటిజన్స్‌తో పాటు ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. సన్నగా నాజూకుగా ఉండే అనన్య పాండే ముందు ముందు బాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. అనన్య పాండేకి అందంతో పాటు నటన ప్రతిభ ఉంది. అందుకే ఆమె బాలీవుడ్‌లో ఈమె సరైన హిట్స్ పడకున్నా ఆఫర్లను అందుకుంటుంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2019 నుంచి సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు తక్కువ సమయంలోనే మంచి పేరును సొంతం చేసుకుంది. అయితే నటిగా కమర్షియల్ హిట్ కోసం వెయిట్ చేస్తోంది.రొమాంటిక్ కామెడీ మూవీ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 లో నటించడం ద్వారా తన నటన ప్రతిభను కనబర్చే అవకాశం ను దక్కించుకున్న అనన్య పాండే ఆ తర్వాత పలు సినిమాల్లోనూ నటించింది. తాజాగా ఈమె కేసరి చాప్టర్ 2 సినిమాలో నటించింది. ఆ సినిమా కమర్షియల్‌గా ఫ్లాప్ అయినప్పటికీ నటిగా అందులో పర్వాలేదు అనిపించింది. ప్రస్తుతం ఈమె చేతిలో రెండు మూడు సినిమాలు ఉన్నాయి. వాటితో అయినా ఈమె కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకుంటుందేమో చూడాలి. ఇలాంటి అందమైన రూపం ఉన్న అనన్య పాండేకు లక్ కలిసి రాకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో ఆఫర్లు దక్కడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# 4 బడా మూవీల రిలీజ్ మంత్స్.. అది నిజమేనా?

టాలీవుడ్ లో బడా హీరోలందరూ తమ అప్ కమింగ్ మూవీస్ తో బిజీగా ఉన్నారు. షూటింగ్స్ లో పాల్గొంటూ తమ షెడ్యూల్స్ ను పూర్తి చేస్తున్నారు. టాలీవుడ్ లో బడా హీరోలందరూ తమ అప్ కమింగ్ మూవీస్ తో బిజీగా ఉన్నారు. షూటింగ్స్ లో పాల్గొంటూ తమ షెడ్యూల్స్ ను పూర్తి చేస్తున్నారు. అందులో కొందరు ఇప్పటికే రిలీజ్ డేట్స్ ను లాక్ చేసుకున్నారు. మరికొందరు త్వరలో విడుదల తేదీలను అనౌన్స్ చేయనున్నారు. ఆ జాబితాల్లో చాలా మంది హీరోలున్నారు. అయితే కొంతకాలంగా బడా హీరోలు నటిస్తున్న సినిమాల విడుదల తేదీల ప్రకటనలు వస్తున్నప్పటికీ.. ఆ తర్వాత మాత్రం మారుతున్నాయి. అనేక కారణాల వల్ల ఛేంజ్ అవుతూ వస్తున్నాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో ఓజీ, విశ్వంభర, అఖండ 2, రాజా సాబ్ సినిమాల విడుదలకు సంబంధించిన ఓ రూమర్ ఫుల్ గా స్ప్రెడ్ అవుతోంది. అది నిజమో కాదో తెలియక పోయినా.. వైరల్ మాత్రం అవుతోంది. సెప్టెంబర్ లో పవన్ కల్యాణ్ ఓజీ.. అక్టోబర్ లో చిరంజీవి విశ్వంభర.. డిసెంబర్ లో బాలకృష్ణ అఖండ-2.. 2026 జనవరిలో ప్రభాస్ రాజా సాబ్ రిలీజ్ అవుతాయని ఓ గాసిప్ చక్కర్లు కొడుతోంది. ఇందులో నిజమెంతో తెలియదు కానీ.. వైరల్ మాత్రం అవుతోంది. అయితే పవన్, సుజీత్ కాంబినేషన్ లో రూపొందుతున్న ఓజీ మూవీ.. సెప్టెంబర్ 25న రిలీజ్ చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. రీసెంట్ గా ఆ విషయాన్ని క్లారిటీ కూడా ఇచ్చారు. దీంతో ఆ రూమర్ లో ఓజీడి రిలీజ్ మంత్ నిజమేనని చెప్పవచ్చు. ఆ విషయంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదని ఫ్యాన్స్ చెబుతున్నారు. ఆ తర్వాత విశ్వంభర సినిమా విషయానికొస్తే.. చిరంజీవి, వశిష్ట కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఆ చిత్రం ఇప్పటికే థియేటర్స్ లో రిలీజ్ కావాల్సి ఉంది. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. వీఎఫ్ ఎక్స్ వర్క్ పెండింగ్ ఉండడమే కారణంగా తెలుస్తోంది. ఇప్పుడు అక్టోబర్ లో సినిమా రిలీజ్ అవుతుందని ప్రచారం జరుగుతోంది. ఇక అఖండ-2 సెప్టెంబర్ లోనే విడుదల అవుతుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. కానీ డిసెంబర్ కు పోస్ట్ పోన్ అవుతుందని వార్తలు వస్తున్నాయి. అయితే అనుకున్న డేట్ కే మేకర్స్ రిలీజ్ చేస్తున్నారని.. ప్రస్తుతం థియేటర్స్ అరేంజ్మెంట్స్ చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. బోయపాటి శ్రీను ఆ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అదే సమయంలో ప్రభాస్ లీడ్ రోల్ లో మారుతి రూపొందిస్తున్న రాజా సాబ్ డిసెంబర్ 5న రిలీజ్ కానుంది. దాన్ని వచ్చే సంక్రాంతికి పోస్ట్ పోన్ చేస్తారని రూమర్ స్ప్రెడ్ అవుతోంది. అయితే ఇప్పటికే సంక్రాంతికి పలువురు బడా హీరోలు చిత్రాలు కర్చీఫ్ వేసేశాయి. ఏదేమైనా ఓజీ తప్పితే.. రాజా సాబ్, విశ్వంభర, అఖండ-2 రిలీజ్ కు సంబంధించిన రిలీజ్ మంత్స్ గాసిప్ లో నిజమెంతో చూడాలి.




# వింబుల్డన్ వెళ్లే స్టార్స్‌పై సోఫీ ఆగ్రహం



తాజాగా ప్రముఖ నటి సోఫీ చౌదరి ఇన్‌స్టాగ్రామ్‌లో షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో వింబుల్డన్ కి హాజరు అయిన సెలబ్రిటీల గురించి ఇన్ఫ్లుయెన్సర్ల గురించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. లండన్‌లో జరిగిన వింబుల్డన్ 2025 కి ప్రపంచ వ్యాప్తంగా వందల సంఖ్యలో సెలబ్రిటీలు హాజరు అయ్యారు. హాలీవుడ్ నుంచి ప్రపంచ దేశాలకు చెందిన ఎంతో మంది సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు పాల్గొన్నారు. అక్కడ ఫోటోలు దిగి సోషల్ మీడియాలో షేర్ చేయడంను చాలా మంది స్టేటస్‌గా భావిస్తున్నారు. తెలుగు దర్శకుడు సుకుమార్ తన భార్యతో కలిసి ఆటను చూసేందుకు వెళ్లిన విషయం తెల్సిందే. సోనమ్ కపూర్, అనుష్క శర్మ, విరాట్, అవ్నీత్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, జాన్వీ కపూర్, మిలింద్ ప్రీతీ జింటా, ఊర్వశి రౌతేలా ఇలా ఎంతో మంది ప్రముఖులు సైతం వింబుల్డన్‌ను చూసేందుకు వెళ్లారు. ఈసారి వింబుల్డన్ గేమ్‌లో బాలీవుడ్ సెలబ్రిటీలు ఎక్కువగా పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. హాలీవుడ్ సెలబ్రిటీలు సింపుల్‌గానే వింబుల్డన్‌ను చూసేందుకు వెళ్తే బాలీవుడ్ సెలబ్రిటీలు మాత్రం ఒక అవార్డ్ వేడుకలో హాజరు అయినట్లుగా అందంగా ముస్తాబయ్యారు. అంతే కాకుండా రెడ్ కార్పెట్ పై ఫోటోలు దిగినట్లుగా ఫోటోలు దిగి వాటిని సోషల్ మీడియా ద్వారా షేర్ చేయడంతో పాటు, తమ తమ పీఆర్ టీంలతో పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో పబ్లిసిటీ అయ్యేలా చేశారు. వింబుల్డన్ వెళ్లిన వారికి గుర్తింపు గౌరవం ఉంటుంది. అందుకే చాలా మంది ఖర్చు ఎక్కువ అయినా సరే అని అక్కడకు వెళ్లి ఫోటోలు దిగి షేర్ చేసిన వారు ఉన్నారు. తాజాగా ప్రముఖ నటి సోఫీ చౌదరి ఇన్‌స్టాగ్రామ్‌లో షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో వింబుల్డన్ కి హాజరు అయిన సెలబ్రిటీల గురించి ఇన్ఫ్లుయెన్సర్ల గురించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. అక్కడకు వెళ్లిన వారిలో చాలామందికి ఆటపై ఆసక్తి లేదని, చాలా మంది వ్యక్తిగత అభిరుచితో వెళ్తే, కొందరు ఎంజాయ్ చేసేందుకు వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేసింది. వింబుల్డన్‌ను చాలా మంది సెలబ్రిటీలు ఫ్యాషన్ రన్ వేగా మార్చడం విడ్డూరంగా ఉందని, వారు చేసిన పనితో ముందు ముందు వింబుల్డన్ స్టేజ్ ఒక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుక మాదిరిగా మారే ప్రమాదం ఉందని సోఫీ చౌదరి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ పోస్ట్ చేసింది.

# వైరల్ వయ్యారితో మరోసారి దేవి మ్యాజిక్!



టాలీవుడ్‌లో మ్యూజికల్ హిట్స్ అంటే ఎక్కువగా గుర్తొచ్చే మ్యూజిక్ డైరెక్టర్స్ లలో దేవి శ్రీ ప్రసాద్ పేరు టాప్ లిస్టులో ఉంటుంది. టాలీవుడ్‌లో మ్యూజికల్ హిట్స్ అంటే ఎక్కువగా గుర్తొచ్చే మ్యూజిక్ డైరెక్టర్స్ లలో దేవి శ్రీ ప్రసాద్ పేరు టాప్ లిస్టులో ఉంటుంది. ఎన్నో బ్లాక్‌బస్టర్ ఆల్బమ్స్ తో ప్రేక్షకుల మన్ననలు పొందిన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తాజాగా "జూనియర్" సినిమాలోని "వైరల్ వయ్యారి" పాటతో మరోసారి తన టాలెంట్‌ను నిరూపించుకున్నాడు. కొత్త హీరో కిరీటి రెడ్డి, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈ సినిమాలో.. ఈ మెలోడియస్ అండ్ మాస్ మిక్స్ చేసిన పాట హిట్ అయి, ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాటకు రీల్స్ మోత మొదలైపోయింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేకుండా వయ్యారి పాట ప్రతి ఫోన్‌లో వినిపిస్తోంది. డీఎస్పీ కంపోజ్ చేసిన మ్యూజిక్ మాత్రమే కాదు, క్యాచీ లిరిక్స్ కూడా ట్రెండ్ అవుతున్నాయి. సంగీత ప్రవాహానికి తోడు, శ్రీలీల ఎక్స్‌ప్రెషన్స్, కిరీటి ఎనర్జీ పాటను మరింత ప్రత్యేకంగా మారుస్తున్నాయి. ఈ పాట ప్రత్యేకత ఏమిటంటే.. కొత్త హీరో కోసం డీఎస్పీ వేసిన సంగీతం ఇది. స్టార్ హీరో లేకపోయినా.. అలాంటి హై ఎనర్జీ సాంగ్ ఇవ్వగల శక్తి డీఎస్పీకే సాధ్యమవుతుంది. తను చేసే ప్రతీ పనిలోనూ డెడికేషన్, కష్టపడే పనితనం కనిపిస్తాయి. అందుకే చిన్న సినిమాగా స్టార్ట్ అయిన "జూనియర్" మూవీకి నేషనల్ లెవెల్ రిచ్ వచ్చింది. ఇటీవల కాలంలో పుష్ప 2, తండేల్, కుబేరా సినిమాలకి సంగీతం అందించిన డీఎస్పీ.. ఇప్పుడు "జూనియర్" పాటతో మరో మ్యూజిక్ సంచలనం నమోదు చేశాడు. ఆయన్ని ఎందుకు హిట్ మెషీన్ అంటారో మరోసారి రుజువైంది. పాటలతో సినిమాల రేంజ్‌ను పెంచగల సత్తా ఉన్న మ్యూజిక్ డైరెక్టర్ అని చెప్పకనే చెప్పాలి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పాటకు డ్యాన్స్ చేసే సెలబ్రిటీలు, ఫ్యాన్స్ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక డీఎస్పీ చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా సినిమాలో హైలైట్ అయ్యే అవకాశం ఉంది. "కుబేరా" టీజర్‌లో వినిపించిన బీజీఎమ్ ఇప్పటికే ప్రేక్షకులను ఫిదా చేసింది. అలాగే "వైరల్ వయ్యారి" పాట సినిమా రిలీజ్‌కి ముందు ఓ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది.

%Editor, Printed, Published and Owned by RACHAKONDACHANDRASEKHAR RAO%, »»%HNO-14-15/3, INDIRA GANDHI NAGAR, VELDURTHI, VELDURTHI MANDAL, KURNOOL DIST, ANDHRAPRADESH..RNI APTEL/2023/88231 Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A. BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP . E-mail: yuvatharamtelugudaily@gmail.com, Cell: +9199899 24749.